

ప్రేమగా... సాగిపో!
- రెండు స్వచ్ఛమైన మనసుల కలయిక
- జీవితంలో అదో మధుర భావన
- నిలువనీయదు.. నిద్దుర రానీయదు..

నేడు ప్రేమికుల దినోత్సవం



... 8వ పేజీలో

డీజిల్ బిల్లుపై ఆడిట్ అభ్యంతరం

సాధారణంగా వచ్చే మొత్తం కంటే ఎక్కువగా రావడానికి కారణాలేమిటో తెలపాల్సిందిగా ఆదేశం

- సరఫరా నిలిపివేసిన బంక్ యజమాని
- నగరంలో ఆగిన ఫాగింగ్
- చెత్త తరలింపుపైనా ప్రభావం

- కొన్ని వాహనాలు నిలిపివేత
- పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న ప్రజారోగ్యం, మెకానికల్ విభాగాలు
- వినియోగంపై ఫిర్యాదులు
- ఇన్‌చార్జి కమిషనర్ వద్ద పంచాయితీ



కాపులుప్పాడ డంపింగ్ యార్డు ప్రహరీ బయట పేరుకుపోయిన చెత్త

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థలో డీజిల్, పెట్రోలు కొనుగోలు, వినియోగంపై పంచాయితీ నడుస్తోంది. వాటికి సంబంధించిన బిల్లులు చెల్లింపునకు ఆడిట్ విభాగం అభ్యంతరాలను వ్యక్తం చేసింది. కొనుగోలులోనే లెక్క తప్పిందని ప్రజారోగ్యం విభాగం అధికారులు ఆరోపిస్తుంటే, వినియోగంలోనే తేడా జరిగిందని మెకానికల్ విభాగం అధికారులు అంటున్నారు. బిల్లు చెల్లించేంత వరకూ డీజిల్, పెట్రోల్ సరఫరా చేసేది లేదని పెట్రోల్ బంకు యజమాని చెప్పడంతో కొద్దిరోజులుగా నగరంలో ఫాగింగ్ ఆగిపోయింది. అలాగే జోన్-2 పరిధిలో చెత్త తరలింపు వాహనాలు కొన్ని నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జీవీఎంసీకి మొత్తం 450 వాహనాలు ఉన్నాయి. ఇందులో కొన్నింటిని చెత్త తరలింపు, గెడ్డల్లో పూడికతీత, నీటి సరఫరా, ఇత్యాది అవసరాల కోసం వినియోగిస్తుంటారు. వీటితోపాటు దోమల నియంత్రణ నిమిత్తం ఫాగింగ్‌కు కూడా జీవీఎంసీయే డీజిల్, పెట్రోల్ సరఫరా చేయాల్సి ఉంటుంది. అన్నింటికీ కలిపి నెలకు రూ.2.5 కోట్ల విలువైన డీజిల్, పెట్రోల్ వినియోగం జరుగుతోంది. ఇందుకు నగరంలోని హెచ్‌పీసీఎల్ కంపెనీకి చెందిన ఒక బంకుతో జీవీఎంసీ తొమ్మిదేళ్ల కిందట ఒప్పందం కుదుర్చుకుంది. బిల్లు చెల్లింపులో జాప్యం జరిగినా సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తగా బంకు ఖాతాలో జీవీఎంసీ అడ్వాన్సుగా రూ.రెండు కోట్లు జమ చేసింది. జీవీఎంసీ వినియోగించిన డీజిల్, పెట్రోల్‌కు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.

ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పనిచేసే చెత్త తరలింపు వాహనాలు, పారిశుధ్య నిర్వహణ యంత్రాలతోపాటు దోమల నియంత్రణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాలకు వినియోగించిన డీజిల్, పెట్రోల్‌కు సంబంధించిన బిల్లులను ... మిగతా 6వ పేజీలో

నిలిచిపోయిన ఫాగింగ్

పెట్రోలు, డీజిల్ సరఫరాను బంకు యజమాని నిలిపివేయడంతో ప్రజారోగ్య విభాగం చేపట్టే ఫాగింగ్‌పై ప్రభావం పడింది. దోమల నియంత్రణకు ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో నిరంతరం ఫాగింగ్ చేస్తుంటారు. దీనికోసం ఆరు మెగా ఫాగింగ్ యంత్రాలు, 56 వరకూ హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలు, కొన్ని స్ప్రింక్లర్లు ఉన్నాయి. ఇవి పనిచేయాలంటే డీజిల్, పెట్రోల్ కూడా అవసరం. కేవలం ఫాగింగ్ కోసమే ప్రతి నెలా రూ.58 లక్షల విలువైన డీజిల్, పెట్రోల్ వినియోగిస్తుంటారు. పెట్రోల్, డీజిల్ సరఫరా లేక ఫాగింగ్ నిలిచిపోవడంతో నగరంలో దోమల వ్యాప్తి పెరిగింది. అదేవిధంగా ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పనిచేసే చెత్త తరలింపు వాహనాలపై కూడా ప్రభావం పడింది. ప్రస్తుతానికి కొన్ని నడుస్తుండగా, ఇప్పటికే డీజిల్ అయిపోయిన వాహనాలు మాత్రం నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మహా అత్యాశ

భూగర్భ విద్యుత్ కేబుల్‌కు గ్రేటర్ మోకాలడ్డు

- గతంలో పనుల కోసం రహదారులపై తవ్వినంత మేరకే పూడ్చివేత చార్జీలు వసూలు
- తారురోడ్డుకు కిలోమీటరుకు 4.07 లక్షలు, సిమెంట్ రోడ్డుకు రూ.3.37 లక్షలు,
- కచ్చా రోడ్డుకు రూ.29 వేలు
- ఇప్పుడు రహదారి మొత్తానికి చెల్లించాలని డిమాండ్
- కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన ఈపీడీసీఎల్ సీఎండీ
- గ్రేటర్ ఇంజనీరింగ్ అధికారులకు క్లాస్ పీకిన కలెక్టర్
- మళ్లీ అంచనాలు రూపొందిస్తామని వెల్లడి



గాజువాక జిలాలో భూగర్భ కేబుల్ పనులు పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల అత్యాశకు అంతులేకుండా పోతోంది. నగర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ముందుకు కదలకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు.

హుద్‌హుద్ వంటి తుపాన్లు వచ్చినప్పుడు విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిపోకుండా ఉండేందుకు నగరంలో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం...రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ కింద ఈ పనులకు 60 శాతం నిధులు ఇస్తోంది. తొలి విడత నగరంలో సముద్ర తీరాన్ని ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో భూగర్భ కేబుల్ వేసిన సంగతి తెలిసిందే. రెండో దశలో నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో ఈ కేబుల్ వేయడానికి రూ.1,362 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఈపీడీసీఎల్ పరిధిలోని జోన్-2, జోన్-3 ఏరియాల్లో 633 కి.మీ.గోతులు తవ్వి కేబుల్ వేయడానికి రూ.650 కోట్లు మంజూరయ్యాయి. జోన్-2 ఏరియాలో గాజువాక, ఆటోనగర్, మల్కాపురం, కంచరపాలెం, మర్రిపాలెం, మురళీనగర్, మాధవధార తదితర ప్రాంతాలు వస్తాయి. జోన్ -3లో విమ్స్ ఏరియా, ఎండాడ, సింహాచలం, భీమిలి, పీఎం పాలెం, చిట్టివలస, పెందుర్తి, వేపగుంట తదితర ప్రాంతాలు ఉన్నాయి.

జీవీఎంసీ అత్యాశ

మొదటి దశలో భూగర్భ విద్యుత్ కేబుల్ వేసినప్పుడు జీవీఎంసీ రహదారులను ఎంత మేరకు తవ్వారో దానికి మాత్రమే చార్జీలు వసూలు చేశారు. అప్పట్లో తారురోడ్డుకు అయితే కిలోమీటరుకు 4.07 లక్షలు, సిమెంట్ రోడ్డుకు అయితే రూ.3.37 లక్షలు, కచ్చా రోడ్డుకు అయితే రూ.29 వేలు తీసుకున్నారు. ఇప్పుడు రెండో దశకు వచ్చేసరికి...ఏయే రహదారులు తవ్వుతారో వాటిని పూర్తిగా వేయడానికి అయ్యే ఖర్చు భరించాలని ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. తారురోడ్డుకు కిలోమీటరుకు కోటి రూపాయలు, సిమెంట్ రోడ్డుకు రూ.80 లక్షలు, కచ్చా రోడ్డుకు రూ.14 లక్షలు కట్టాల్సి ఉంటుందని అంచనాలు ఇచ్చారు. దానికి ఈపీడీసీఎల్ అధికారులు ఆశ్చర్యపోయారు. ఎక్కడైనా రోడ్డును ఎంత తవ్వితే దానికి మాత్రమే చార్జీలు వసూలుచేసే సంప్రదాయం నడుస్తున్నదని, ఆ రోడ్డు మొత్తం వ్యయం భరించాలని కోరడం అన్యాయమని జీవీఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ కలిశారు. నగరంలో భూగర్భ కేబుళ్లను జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు కూడా వేస్తున్నాయని, వారి నుంచి అలా వసూలు చేయడం లేదని పలువురు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దాంతో కలెక్టర్ వెంటనే జీవీఎంసీ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి క్లాస్ పీకారు. గాజువాక సమీపాన ఆటోనగర్‌లో ఐలా రూపాయి కూడా తీసుకోకుండా పనులు చేయడానికి అనుమతి ఇచ్చిందని, నగర ప్రజలకు ... మిగతా 6వ పేజీలో

ఆగస్టుకు పూర్తి చేయాలనేది లక్ష్యం

\- శ్యామ్‌కుమార్, ఎస్ఈ, విశాఖ సర్కిల్



నగరంలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ఈ ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. జీవీఎంసీ అధికారులు ఇప్పటివరకూ ఎటువంటి క్లియరెన్స్ ఇవ్వలేదు. ఆటోనగర్‌లో ఇప్పటికే పది కిలోమీటర్ల మేర పనులు పూర్తిచేశాము. అనుమతులు ఇస్తే గడువులోగా మిగిలిన పనులు కూడా పూర్తిచేస్తాం.

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం రాత్రి నగరానికి రానున్నారు. ఆయన గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరి 6.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు.




విమానాశ్రయం నుంచి రాత్రి 7.10 గంటలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేస్తారు. శనివారం ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో గల సన్‌రే విలేజ్ రిసార్ట్‌లో వెళతారు. అక్కడ జస్టిస్ డి.రమేష్ కుమార్తె వివాహానికి హాజరవుతారు. అనంతరం 11.30 గంటలకు బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని మధ్యాహ్నం 12.55 గంటలకు హైదరాబాద్ వెళతారు.

వాట్సాప్ ద్వారా సింహాచలం దేవస్థానం సేవలు

సింహాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో అధికారులు వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టారు. భక్తులు ఆర్జిత సేవల టికెట్ల కొనుగోలు, విరాళాల సమర్పణ వంటివి వాట్సాప్ (955 2300009) ద్వారా చేసుకోవచ్చునని కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథ రావు తెలిపారు.



పైన పేర్కొన్న నంబర్‌కు ఆంగ్లంలో హాయ్ అని పంపితే పలు సేవలు అందుబాటులోకి వస్తాయి. అందులో సింహాచలం దేవస్థానాన్ని ఎంపిక చేసుకుని దర్శనం, సేవలు, డొనేషన్లు... ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో మనకు కావలసిన దానిని ఎంపిక చేసుకోవచ్చు. నిర్దేశించిన రుసుమును చెల్లించి తగు డిజిటల్ రశీదును పొందాలి.

వందేభారత్‌కు ఏలూరులో హాల్ట్ కొనసాగింపు



... 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో పది మంది...

- నామినేషన్ల ఉపసంహరణకు ముగిసిన గడువు
- 27వ తేదీన పోలింగ్
- 22,493 మంది ఓటర్లు
- 123 కేంద్రాలు
- ఏయూలో మార్చి 3న ఓట్ల లెక్కింపు
- రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్. చిత్రంలో డీసీపీ అజితా వేజెండ్ల ఉన్నారు.

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పది మంది పోటీలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఈసీ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే విశాఖ జిల్లాలో 12 ఎంసీసీ బృందాలు, ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ నియమించామన్నారు.

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఈనెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ... మిగతా 6వ పేజీలో

బరిలో అభ్యర్థులు వీరే...

1. కోసూరు రాధాకృష్ణ, 2.నూకల సూర్యప్రకాష్, 3.పాకలపాటి రఘువర్మ, 4.కోరెడ్ల విజయగౌరి, 5.రాయల సత్యనారాయణ, 6.గాదె శ్రీనివాసులనాయుడు, 7.సత్తలూరి పద్మావతి, 8.పెదపెంకి శివప్రసాద్, 9.సుంకర శ్రీనివాసరావు, 10.పోతల దుర్గాప్రసాద్.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు

నగరమంతా పూర్ణామార్కెట్ మోడల్

- స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తాం
- జీవీఎంసీ, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకుంటాం
- ప్రత్యామ్నాయంగా వ్యాపారులకు హాకర్ జోన్లు ఏర్పాటుకు చర్యలు
- పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి



ఆక్రమణలు తొలగించిన తర్వాత పూర్ణామార్కెట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రోడ్లపై ఆక్రమణలను తొలగించేందుకు ఇకపై పూర్ణామార్కెట్ తరహా మోడల్‌ను కొనసాగిస్తామని పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి అన్నారు. పూర్ణామార్కెట్ ప్రధాన రహదారితోపాటు చుట్టుపక్కల రోడ్లపై ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు, సిబ్బంది సహకారంతో వన్‌టౌన్ పోలీసులు రెండు రోజుల క్రితం తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితి, వ్యాపారులు, కొనుగోలుదారుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు సీపీ శంఖబ్రతబాగ్చి గురువారం స్వయంగా పూర్ణామార్కెట్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో విశాలంగా మారిన రహదారులపై కేటాయించిన ప్రాంతంలో కొనుగోలుదారులు వాహనాలను పార్కింగ్ చేసుకుంటుండడం చూసి సీపీ సంతోషం వ్యక్తంచేశారు. ఆ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులతోపాటు మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులతో మార్కెట్ వద్ద గతంలో ఉన్న పరిస్థితి, ప్రస్తుతం పరిస్థితిపై ... మిగతా 6వ పేజీలో

జూన్ నాటికి ఫ్లైఓవర్

- ఆ రెండు జంక్షన్లలో తొలగనున్న ట్రాఫిక్ ఇబ్బందులు
- ప్రమాదాలకు చెక్



ఎయిర్‌పోర్టు జంక్షన్ సమీపాన జరుగుతున్న ఫ్లైఓవర్ పనులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం విమానాశ్రయం జంక్షన్, షీలానగర్ జంక్షన్లలో ప్రమాదాలకు త్వరలో చెక్ పడనుంది. ఇక్కడ జాతీయ రహదారి పక్కన కంటెయినర్ కార్పొరేషన్ కార్యాలయం (కాంకర్) ఉన్న సంగతి తెలిసిందే. అక్కడే మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఉంది. పోర్టులో దిగుమతి అయిన కంటెయినర్లన్నీ ట్రెయిలర్లపై డాక్‌యార్డు మార్గంలో విమానాశ్రయం పక్క నుంచి ఇక్కడకు వస్తాయి. అలాగే ఇతర ప్రాంతాల నుంచి పోర్టు ద్వారా ఎగుమతి కావలసిన సరకులు కూడా షీలానగర్ మీదుగా ఇక్కడకు వస్తాయి. ఈ కంటెయినర్ ట్రెయిలర్లు విమానాశ్రయం జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇవి జాతీయ రహదారిపై ఇటు నుంచి, అటు నుంచి ఇటు రావడం వల్ల సాధారణ వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దాంతో పోలీసులు ఈ భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఉదయం ఎనిమిది గంటలలోపు, రాత్రి పది ... మిగతా 6వ పేజీలో

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మధురవాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రేవళ్ళపాలెం ఫీడర్ మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 విద్యుత్ శాఖఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వల్లీ నగర్, మధురవాడ హైస్కూల్ పరిసరాలు, రేవళ్ళపాలెం, పోలీస్‌స్టేషన్, ఎంఎస్ఆర్ లేఅవుట్, భాస్కర్‌నగర్ ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వెల్లడించారు.

సింహాచలంలో..

సింహాచలం : ఎస్ఆర్‌పురంలోని 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర నిర్వహణ పనులు చేపడుతుండడంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దువ్వపాలెం, సౌభాగ్యరాయపురం, దబ్బంద, భైరవవాక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలి

కొమ్మాది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పేర్కొన్నారు. గురువారం కొమ్మాది ప్రభుత్వ పాఠశాలలో చైతన్య ఇంజనీరింగ్ కళాశాల (కొమ్మాది) ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఇబ్బంది కలిగించినా వెంటనే మీ తల్లితండ్రులకు విషయాన్ని తెలియజేయాలని సూచించారు. అలాంటి సమయంలో భయపడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సునీల్‌బాబు, పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరోజినీనాయుడికి నివాళి

కొమ్మాది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలితరం మహిళల్లో సరోజినీనాయుడు ఒకరని, ఆమె ధీరవనిత అని చంద్రపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.రవి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలోని సాంఘికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సరోజినీనాయుడు జయంతిని నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు.తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన మేధావి అని, స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాచలేశునికి పసిడి కుసుమార్చన



స్వామికి స్వర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రహ్లాదవరదుడు సింహాద్రి అప్పన్న స్వామికి శుక్రవారం వైభవంగా పసిడి కుసుమార్చన నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశాక ఉభయ దేవేరులతో పాటు స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. పసిడి పుష్పాలతో బేడా మండప ప్రదక్షిణ చేశాక భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ పసిడి సంపెంగలతో అర్చించారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చాక భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా సింహాచలేశుని నిత్య కల్యాణాన్ని పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో వైభవంగా నిర్వహించారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి 98వ వార్డుకు చెందిన దేవస్థానం విశ్రాంత ఏఈవో కోరాడ పైడినాయుడు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో నిత్యాన్న ప్రసాద విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి పిళ్లా శ్రీనివాసరావుకు అందజేశారు. దాతకు అంతరాలయంలో స్వామివారి దర్శన భాగ్యం కల్పించి శేషవస్త్రంతో సత్కరించి, వేదాశీర్వచనాలను, ప్రసాదాలను అందజేశారు.

స్పోర్ట్స్ కిట్‌ల పంపిణీ

భీమునిపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న 108 మంది విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ నిర్వాహకులు గురువారం స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాంప్రసాద్, పాఠశాల హెచ్ఎం పి.రమణ, నాన్హికాలీ ప్రాజెక్టు సీఈవో కె.సత్యవతి, ఆర్.గౌరీసాయి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

జూట్‌మిల్లు భూముల విక్రయించకుండా నిలువరించండి

» చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యంపై అధికారులకు కార్మిక శాఖ సంఘాల ఫిర్యాదు



కార్మిక శాఖ జాయింట్ లేబర్ కమిషనర్ రామారావుతో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నేతలు

తగరపువలస, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించకుండా, బకాయిలు చెల్లించకుండా కంపెనీ భూములను అమ్ముకునే కుతంత్రాలకు పాల్పడుతోందని, యాజమన్య దుశ్చర్యలను నిలువరించాలని చిట్టివలస జూట్ మిల్లుకార్మికులతో పాటు అన్ని కార్మిక సంఘాల నాయకులు కోరారు. వీరంతా గురువారం కార్మిక శాఖ అధికారులను కలిసి విన్నవించారు. తమకురావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, అంతవరకు సెంటు భూమి కూడా విక్రయించరాదని ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ జాయింట్ లేబర్ కమిషనర్ రామారావును కలిసి వినతిపత్రం అందించారు. జూట్‌మిల్లుకు సంబంధించి కొన్ని భూములు వివిధ కారణాలతో అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, వాటిని యథాతథంగా ఉంచాలని కోరారు.

స్థానిక ఎంఎల్‌ఏ గంటా శ్రీనివాసరావు సమక్షంలో రెండు రోజుల క్రితం కార్మిక నాయకులు, యాజమాన్య ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగిన నేపథ్యంలో సమస్య పరిష్కారం అవుతుందని అంతా భావించామన్నారు. అయితే సంబంధిత అధికారుల ఆమోదంతో ఈ చెల్లింపులు చేస్తామంటూ యాజమాన్య ప్రతినిధులు మెలిక వేశారని, ఈ నేపథ్యంలో భూముల విక్రయానికి తెగబడుతున్నారంటూ కార్మిక సంఘాల నేతలు మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో అధికార కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) నాయకులు కేవీ నర్సింహరాజు, జీరు వెంకటరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, ఇతర సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సాహిత్యం సమాజహితాన్ని కోరాలి

» ఏయూ తెలుగు శాఖాధిపతి అప్పారావు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అప్పారావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సమాజహితాన్ని కోరే విధంగా సాహిత్యం ఉండాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి జర్ర అప్పారావు పేర్కొన్నారు. గురువారం భీమిలి ఎస్వీఎల్ఎన్ఎస్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'అభ్యుదయ సాహిత్య వికాసం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అప్పారావు మాట్లాడుతూ అభ్యుదయ కవులు సమాజ నిర్మాణంలో చేసిన సాహిత్య సేవను వివరించారు. సమాజంలో పీడించేవారు, పీడింపబడేవారు అని రెండు వర్గాలు ఉంటాయన్నారు. సమసమాజ నిర్మాణంలో పీడన అనేది ఏ రూపంలో కూడా ఉండకూడదన్నారు. సాహిత్యం ద్వారా మానవత్వాన్ని పెంపొందించడానికి ఏ విధంగా సాహిత్యం దోహదపడిందో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీహెచ్ విష్ణుమూర్తి, కళాశాల తెలుగు ఉపన్యాసకుడు ప్రవీణ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా హరికిరణ్‌రెడ్డి



భీమునిపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. భీమిలికి చెందిన హరికిరణ్‌రెడ్డికి ఈ పదవి వరించడంపై ఆ పార్టీ స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావులకు హరికిరణ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఫుడ్ పాయిజన్ ప్రచారంలో వాస్తవం లేదు

సిడార్ స్కూలులో ఎంఈవోల విచారణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : భీమిలి గొల్లలపాలెం సెడార్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగిందన్న ప్రచారం కలకలం రేగింది. దీంతో భీమిలి మండల విద్యాశాఖాధికారులు మానేపల్లి శివరాణి, అట్టాడ జయప్రద శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు.పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో 15 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారంటూ ప్రచారం జరిగింది. అయితే ఇందులో వాస్తవం లేదని ఎంఈవోల విచారణలో తేలింది.

రెండు రోజుల క్రితం ఆ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న అరకు ప్రాంతానికి చెందిన బక్క వైష్ణవికి కడుపు నొప్పి వచ్చి వాంతులు చేసుకొంది. మరుసటి రోజు 8వ తరగతి విద్యార్థి గాజువాకకు చెందిన అడారి శశ్వంత్ నాగసాయికి కూడా అలాగే జరిగింది. వీరిద్దరికీ పాఠశాలయాజమాన్యం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించింది.

ఈ సందర్భంగా ఎంఈవోలు శివరాణి, జయప్రద విలేకరులతో మాట్లాడుతూ సంఘటన జరిగిన రోజు అందరికీ ఒకే విధమైన వంటకాలు వడ్డించారన్నారు. ఎవరికీ ఎలాంటి సమస్య ఉత్పన్నం కాలేదన్నారు. ఈ ఇద్దరు విద్యార్థినులు బయట ఫుడ్ తినడం, ఇందులో ఒకరికి గైనకాలజీ సమస్య రావడంతో కాస్త అనారోగ్యం చేసిందన్నారు.

అంతకుముందు ఆహార పదార్థాలను ఎంఈవో-2 జయప్రద పరిశీలించి రుచి చూశారు. పదార్థాలు బాగున్నాయన్నారు. విద్యార్థులు ఆరగించే భోజనాన్నే కార్యాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు కూడా ఆరగిస్తారన్నారు. అప్రమత్తతతో వీటిని తయారు చేయాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

దివ్యాంగ పింఛన్‌దారుల ధ్రువపత్రాల పునఃపరిశీలన



పింఛన్‌దారుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

భీమునిపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లవలస, తాటితూరు గ్రామ సచివాలయాల పరిధిలో గల దివ్యాంగ పింఛన్‌దారుల ధ్రువపత్రాల పునఃపరిశీలన కార్యక్రమాన్ని గురువారం పట్టణ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి హనుమంతరావు మాట్లాడుతూ ఈ సచివాలయాల పరిధిలో మొత్తం 79 మంది లబ్ధిదారులుండగా, 76 మంది హాజరయ్యారన్నారు. ఇద్దరు అందుబాటులో లేరని, మరొకరు మృతి చెందారన్నారు. వీరందరి ధ్రువపత్రాల పరిశీలన, వికలాంగత్వంపై ఆర్థోపెడిక్ వైద్యులతో పరీక్షలు చేయించడం జరిగిందన్నారు. కాగా ఈ నెల 18న మజ్జిపేట, మూలకుద్దు, చిప్పాడ, 19న పెద నాగమయ్యపాలెం, సింగనబంద, టి.నగరపాలెం, మజ్జివలస, 20న అమనాం, అన్నవరం, దాకమర్రి, లక్ష్మీపురం గ్రామాల్లో దివ్యాంగుల రీ-వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి మొత్తం 392 మందికి నోటీసులు జారీ చేశామని హనుమంతరావు తెలిపారు.

పుష్పయాగంతో ముగిసిన వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు



సింహాచలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి అనుబంధ ఆలయంగా కొండదిగువ స్వామివారి పుదోటలో కొలువుదీరిన పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు గురువారం జరిగిన పుష్పయాగంతో ముగిశాయి. ఈ నెల 7న అంకురారోపణతో వార్షిక కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టగా, గురువారం రాత్రి పుష్పయాగాన్ని ఆలయ ఉప ప్రధానార్చకులు కరి సీతారామాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు శ్రీకాంతాచార్యులు, భార్గవాచార్యులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. లోక కల్యాణార్థం అనే సంకల్పంతో షోడశోపచార పూజలు చేసి వివిధ రకాల పువ్వులతో పుష్పయాగం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చాక అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మానవ మేధస్సుకు కృత్రిమ మేధ ప్రత్యామ్నాయం కాదు

» గీతం హెచ్ఆర్ కాన్‌క్లేవ్‌లో నిపుణులు



కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న మానవ వనరుల నిపుణులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మానవ మేధస్సుకు కృత్రిమ మేధ ప్రత్యామ్నాయం కాదని, ముఖ్యంగా జీవశాస్త్రాలను అభ్యసించే విద్యార్థులు లోతైన విషయ పరిజ్ఞానంతో, పరిశోధన దృష్టితో అవకాశాలను అందుకోవాలని పలువురు మానవ వనరుల నిపుణులు సూచించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఔషధ, జీవశాస్త్ర పరిశ్రమల్లో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు-నైపుణ్యాలు అనే అంశంపై గురువారం నిర్వహించిన హెచ్ఆర్ కాన్‌క్లేవ్‌కు పలు పరిశ్రమల నిపుణులు హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేఏస్ కృష్ణ మాట్లాడుతూ జీవశాస్త్ర రంగంలో పరిశోధనలకు ఆకాశమే హద్దు అని అన్నారు. లీఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ లీలారాణి మాట్లాడుతూ ఫార్మా రంగంలో బహుముఖ ప్రజ్ఞతో విద్యార్థులు ఎదగాలన్నారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థ మానవ వనరుల విభాగం అధిపతి బట్టి శేఖర్ మాట్లాడుతూ కళాశాల నుంచి కార్పొరేట్ రంగానికి వచ్చే వారిలో సమర్థతకు పెద్దపీట వేస్తామన్నారు. సన్‌విరా బయోసైన్సెస్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శివబాలన్ కన్నన్ మాట్లాడుతూ నూతన అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. గ్లాండ్‌ఫార్మా సంస్థ క్రొమటోగ్రఫిక్ నిపుణుడు చైతన్య గోగుల పతి మాట్లాడుతూ ఔషధాల తయారీ, డిజైనింగ్, నాణ్యత ప్రమాణాలు, ఎనలిటిక్స్ వంటి అంశాలలో కృత్రిమ మేధ వినియోగం పెరుగుతున్నందున అందుకు తగ్గ నిపుణుల అవసరం కూడా ఉందన్నారు. గీతం ఇన్నోవేషన్ అధికారి ఎన్.క్రిశ్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు ప్రథమ సంవత్సరం నుంచే సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఫార్మశీ ప్రిన్సిపాల్ మహింద్ర, సంస్థ నిపుణుడు సాంకేత్‌కుమార్ పాత్ర, సెర్డిగో సంస్థ సీఈవో డాక్టర్ బి.షీలా, క్లినోసోల్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు మూజీబుద్దీన్ షేక్, సేఫ్‌విగ్ సొల్యూషన్ సంస్థ సహ వ్యవస్థాపకురాలు శ్రీదివ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న పింఛన్‌దారులు

కనీస పింఛన్ రూ.9 వేలు చేయాలంటూ ప్రదర్శన

తగరపువలస, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కార్మికుల కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలను చేయాలని కోరుతూ గురువారం తగరపువలస పురవీధుల్లో చిట్టివలస జూట్‌మిల్లు పింఛన్‌దారులు ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలో కనీస పింఛన్‌పై జరుగుతున్న ఆందోళనలకు మద్దతుగా ఇక్కడ ప్రదర్శన చేపట్టారు. రైల్వే చార్జీలలో రాయితీలు ఇవ్వాలని, ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కానూరి రాంబాబు, దామోదర బాబాజీ, ఎం.అప్పలరాజు, చిల్ల అప్పారావు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ బిల్లుపై ఆడిట్ అభ్యంతరం

... 5వ పేజీ తరువాయి

వివరాలతో సంబంధిత అధికారులు మెకానికల్ విభాగం అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. వాటితోపాటు జీవీఎంసీ వాహనాలు వినియోగించిన డీజిల్, పెట్రోల్‌కు

సంబంధించిన పూర్తి వివరాలతో మెకానికల్ విభాగం అధికారులు బిల్లు తయారుచేసి ఆడిట్ విభాగం అధికారులకు పంపిస్తే వారు సమగ్రంగా పరిశీలించి చెల్లింపునకు సిఫారసు చేస్తుంటారు. ఇదిలావుంటే గతనెలలో వినియోగించిన డీజిల్, పెట్రోల్‌కు సంబంధించిన బిల్లును మెకానికల్ విభాగం అధికారులు ఆడిట్ విభాగానికి పంపించగా, అక్కడ ఫైల్‌ను పరిశీలించి కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. సాధారణంగా వచ్చే బిల్లు కంటే అదనంగా రావడంతో...వినియోగం పెరగడానికి గల కారణాలు, ఒకవేళ అదనంగా వాహనాలను వినియోగించినట్టయితే వాటి వివరాలు, ఒకవేళ గతంలో బకాయిలను ఇప్పుడు బిల్లులో కలిపినట్టయితే అవి సమర్పించాలని కోరినట్టు సమాచారం. దీంతో బంకు ఖాతాలో అడ్వాన్స్ కింద జీవీఎంసీ ఉంచిన రూ.2 కోట్లను బంకు యజమాని అప్పటివరకూ తాను సరఫరా చేసిన డీజిల్, పెట్రోల్‌కు సర్దుబాటు చేసుకున్నారు. అడ్వాన్స్ మొత్తాన్ని జమ చేసేంత వరకు డీజిల్, పెట్రోలు సరఫరా చేయలేనని చేతులెత్తేశారు.

జోన్-2 పరిధిలో క్లాప్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి సేకరించే చెత్తను నేరుగా కాపులుప్పాడలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ప్రహరీ గోడ వద్ద డంప్ చేస్తాయి. అక్కడి నుంచి ఆ చెత్తను ప్రొక్లెయిన్‌లు లారీల్లో లోడ్ చేస్తే...అవి తీసుకువెళ్లి ప్లాంటులో గల ర్యాంప్‌లో అన్‌లోడ్ చేస్తాయి. ఇందుకోసం అక్కడ రెండు ప్రొక్లెయినర్లు, మూడు లారీలు ఉన్నాయి. డీజిల్ లేకపోవడంతో ప్రొక్లెయినర్లు, మూడు లారీలు నిలిచిపోయాయి. క్లాప్ వాహనాలు ప్రస్తుతం చెత్తను తీసుకువెళ్లి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు ప్రహరీ ముందు అన్‌లోడ్ చేసి వెళ్లిపోతుండడంతో అక్కడ కుప్పలు పేరుకుపోతున్నాయి.

పరస్పర ఆరోపణలు

బిల్లుపై ఆడిట్‌లో అభ్యంతరాలు రావడానికి మీరు కారణమంటే మీరే కారణమంటూ మెకానికల్, ప్రజారోగ్యం విభాగాల అధికారులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఫాగింగ్‌కు వినియోగించే డీజిల్, పెట్రోల్ బిల్లును సాధారణం కంటే నెలకు రూ.30 లక్షలు అదనంగా పెంచి ప్రజారోగ్య విభాగం నుంచి పంపించారంటూ మెకానికల్ విభాగం అధికారులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న బకాయిలను ఇప్పుడు చెల్లించాలంటూ ప్రస్తుత బిల్లుతో కలిపి మెకానికల్ విభాగం అధికారులు పంపించడం వల్లే ఆడిట్‌లో అభ్యంతరాలు వచ్చాయని ప్రజారోగ్యవిభాగం అధికారులు ఆరోపిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలు, వినియోగంపై తలెత్తిన పంచాయితీ ఇన్‌చార్జి కమిషనర్ దృష్టికి చేరడంతో ఇరు విభాగాల అధికారులతో పాటు ఆడిట్ విభాగం అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారంపై దృష్టిపెట్టాలని ఆదేశించినట్టు తెలిసింది.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పూర్ణామార్కెట్ రోడ్డులో ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యతోపాటు వాహనంపై వస్తే ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితి ఉండేదని, దీనిపై జీవీఎంసీ, పోలీస్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినాసరే ఫలితం లేకపోయిందని, ఇప్పుడు ఆక్రమణలను తొలగించడంతో అన్నివిధాలుగా సౌకర్యంగా ఉందని సీనియర్ సిటిజన్ ఒకరు సీపీకి వివరించారు. ఈ నేపథ్యంలో నగరంలో రోడ్ల ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టు స్పెషల్‌డ్రైవ్ కొనసాగిస్తామని సీపీ వివరించారు. ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామన్నారు. అందుకు జీవీఎంసీతోపాటు ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటామన్నారు. వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా చూపించేందుకు నగరంలో హాకర్‌జోన్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జూన్ నాటికి ఫ్లైఓవర్

... 5వ పేజీ తరువాయి

గంటల తరువాత మాత్రమే అనుమతిస్తున్నారు. దాంతో సరకులు తెప్పించుకునే వ్యాపారులు సకాలంలో డెలివరీ కాక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కాంకర్ చొరవ చూపింది. విశాఖ పోర్టు యాజమాన్యంతో మాట్లాడి విమానాశ్రయం జంక్షన్ సమీపాన ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భారత జాతీయ రహదారుల సంస్థతో కలిసి రూ.58.73 కోట్లతో ఫ్లైఓవర్ పనులు గత ఏడాది ఆగస్టులో ప్రారంభించింది. ఈ పనులు ఈ నెల 13వ తేదీ నాటికి పూర్తి కావలసి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పనులు వేగవంతంగా జరగడం లేదు. దాంతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దీనిపై రెండు రోజుల క్రితం పార్లమెంటులో ప్రశ్నించారు. జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ జూన్ నాటికి ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తుందని సమాధానమిచ్చారు.

ఇకపై ఇబ్బందులు ఉండవు

- జి.సాంబశివరావు, శ్రవణ్ షిప్పింగ్ అధినేత

కాంకర్ నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వల్ల షీలానగర్, విమానాశ్రయం జంక్షన్లలో రహదారులపై ఇక కంటెయినర్ ట్రెయిలర్లు కనిపించవు. అవి కొత్తగా వచ్చే ఫ్లైఓవర్ పైనుంచే రాకపోకలు సాగిస్తాయి. సమయం కలిసి వస్తుంది. త్వరగా సరకులు గమ్యస్థానాలకు చేరతాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో పది మంది..

... 5వ పేజీ తరువాయి

ఓటర్లు (పురుషులు 13,508 మంది, మహిళలు 8,985) మంది ఉన్నారన్నారు. మొత్తం 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూర్చున్నామని, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటుచేస్తున్నామన్నారు. పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇస్తున్నామని, ఓటర్లకు వివరాలతో స్లిప్పులు అందజేస్తామన్నారు. పోలింగ్ తరువాత బ్యాలెట్ బాక్సులు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరుస్తామని, మార్చి 3వ తేదీన అక్కడే ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రచారం నిర్వహించకూడదని కలెక్టర్ అన్నారు. విలేకరుల సమావేశంలో డీసీపీ అజితా వేజెండ్ల, డీఆర్వో భవానీశంకర్ పాల్గొన్నారు.

మహా అత్యాశ

... 5వ పేజీ తరువాయి

చక్కటి సదుపాయం లభిస్తుంటే దానిని ఎలా అడ్డుకుంటారని చీవాట్లు పెట్టారు. అమృత్ పథకం కింద పనులు కూడా ఇలాగే చేస్తున్నారా? అని ప్రశ్నించారు. దాంతో జీవీఎంసీ అధికారులు మళ్లీ అంచనాలు రూపొందించి ఇస్తామని చెప్పారు. అప్పటి వరకూ పనులు ఆగిపోవలసిందేనా?...అని ఈపీడీసీఎల్ అధికారులు ప్రశ్నించగా...నగర శివార్లలో ఉన్న కచ్చా రోడ్లలో పనులు చేసుకోవచ్చునని, వాటికి ఎటువంటి రుసుము వసూలు చేయబోమని సమాధానమిచ్చారు.

వందేభారత్‌కు ఏలూరులో హాల్ట్ కొనసాగింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరు స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన హాల్ట్‌ను మరో ఆరు నెలలపాటు కొనసాగించనున్నామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20707) ఉదయం 9.49 గంటలకు ఏలూరు స్టేషన్‌కు చేరి...తిరిగి 9.50 గంటలకు బయలుదేరుతుంది. ఇక విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708) సాయంత్రం 5.44 గంటలకు ఏలూరు స్టేషన్‌కు చేరి, తిరిగి 5.45 గంటలకు బయలుదేరుతుంది. ఇరువైపులా కేవలం ఒక నిమిషం మాత్రమే హాల్ట్ కల్పించారు.

పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు

» ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మంచి ఎవరు చెప్పినా వినే స్వభావం కలిగి ఉండడం, ధర్మానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వల్లే శ్రీరాముడు ఇప్పటికీ పురుషోత్తముడిగా కీర్తింపబడుతున్నాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఇక్కడి గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా అరణ్యకాండలోని సీతాపహరణం తర్వాత జరిగిన సంఘటనలను వివరించారు. మారీచుని మరణం తర్వాత అనేక దుశ్శకునాలను చూసిన శ్రీరాముడు ఆర్తితో వెనక్కి వస్తూ మధ్యలో లక్ష్మణుడిని కలుసుకుని ఎందుకు వచ్చావని అడగడం, సీతాదేవి లక్ష్మణుడిని నిందించడం వంటి విషయాలను తెలుసుకుని సీత నిందించినప్పటికీ ఆవిడను వదలి రావడం తప్పేనని సోదరునికి శ్రీరాముడు చెప్పడి, రామలక్ష్మణులు పర్ణశాలకు వెళ్లడం, తదితరు ఘట్టాలను చాగంటి వివరించారు. కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయ ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ,గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం

తగరపువలస, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సరోజినినాయుడు 146వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జి సీతామహాలక్ష్మి, మహిళా రక్షణ సెల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఆంగ్ల విభాగాధిపతి సత్యఫణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి 11 కేవీ కైలాసగిరి ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతుండడంతో జీవీఎంసీ 9, 10 వార్డుల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బీఎస్ఆర్‌నగర్, తోటగరువు, హనుమంతవాక కొండవాలు ప్రాంతం, విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

నేడు ఐటీఐ అభ్యర్థులకు జాబ్‌మేళా

కంచరపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో శుక్రవారం ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. జాబ్‌మేళాలో దుబాయ్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖకంపెనీల ప్రతినిధులుపాల్గొంటారన్నారు. ఐటీఐలో ఫిట్టర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్ తదితర ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు హాజరుకావచ్చునన్నారు. అర్హత గల విద్యార్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు వివరాలకు 9121983798 ఫోన్ నంబర్‌ను సంప్రతించాలని కోరారు.

వైసీపీ జిల్లా అధికార ప్రతినిధిగా దుర్గారావు



రామ్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధిగా పల్లా దుర్గారావు నియమితులయ్యారు. ఇప్పటి వరకూ తూర్పు నియోజకవర్గం పరిధి 28వ వార్డు వార్డు ఇన్‌చార్జిగా ఉన్న దుర్గారావును పార్టీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధిగా నియమిస్తూ నియామక పత్రాన్ని పార్టీ అందజేసింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీ పూర్వ వైభవానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్, పార్టీ జిల్లా నేతలకు దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు.

షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు

ఆరిలోవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలో వెలసిన నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం 12 వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేపట్టారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు)16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 28, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

ఫైళ్లను సకాలంలో పరిష్కరించాలి

ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకుమార్



పర్సనల్, అకౌంట్స్ అధికారులతో మాట్లాడుతున్న ఈడీ విజయకుమార్

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : అధికారులకు నిర్దేశించిన పనులు క్రమబద్ధంగా జరిగితే నిర్వహణ పటిష్టంగా ఉంటుందని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్ అన్నారు. ఎంవీపీ కాలనీ బస్ కాంప్లెక్సులోని ఈడీ క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విశాఖపట్నం, శ్రీకాకుళం, అనకాపల్లి, జిల్లాల పర్సనల్, అకౌంట్స్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థకు సంబంధించిన ఫైళ్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, విజయనగరం జోన్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సుధాబిందు, డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వీవీవీ నాగేశ్వరరావు, విశాఖ రీజియన్ పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ వి.వంశీమోహిని పాల్గొన్నారు.

తెలుగు అకాడమీ బీఎడ్ పాఠ్య పుస్తకం విడుదల



పాఠ్య పుస్తకం విడుదల చేస్తున్న వీసీ శశిభూషణ్‌రావు, రెక్టార్ కిశోర్‌బాబు, ప్రొఫెసర్లు జయరాం, నరసింహారావు తదితరులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలుగు, సంస్కృత అకాడమీ ఇటీవల రెగ్యులర్ బీఈడీ, ఉపాధ్యాయ పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం వివిధ పుస్తకాలను ప్రచురించింది. ఇందులో భాగంగా ఏయూ దూర విద్యా విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ కనకల జయరాం సహరచయితగా ఉన్న బీఈడీ తృతీయ సెమిస్టర్‌కు సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో 'పెడగాజీ ఆఫ్ బయలాజికల్ సైన్సెస్-2' అనే పాఠ్య పుస్తకాన్ని ఏయూ ఇన్‌చార్జి వీసీ జి.శశిభూషణరావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమి అన్ని పోటీ పరీక్షలకు మార్గదర్శకంగా ఉండే ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠ్య పుస్తకాలను ప్రచురిస్తోందన్నారు. ఈ పుస్తకాల విడుదల కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజకుమారి, సీడీవోఈ డైరెక్టర్ ఆచార్య విజయమోహన్, సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్‌పై కలెక్టర్ సమావేశం

మహారాణిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఆతిథ్య సంస్థలు, అతిథి సౌకర్యాలు, భద్రతా నిర్వహణ, పారిశుధ్యం మెరుగుపరిచే పద్ధతులను అనుసరించాలన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, జడ్పీ సీఈవో, జిల్లా పర్యాటక శాఖాధికారి, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌తో సహా పలు విభాగాల అధి కారులతో కమిటీని నియమించారు. షెడ్యూల్ ప్రకారం మూడు దశల్లో కార్యక్రమాలుంటాయని కలెక్టర్ తెలిపారు. ఓరియంటేషన్ వర్క్‌షాప్‌లు నిర్వహించి, సేఫ్టీ శానిటేషన్, ఈకో టూరిజం,ఆతిథ్య నియమావళిపై వివరిస్తామన్నారు. వాలంటరీ డిక్లరేషన్‌లో భాగంగా శానిటరీ పారామీటర్స్ సపోర్టింగ్ డాక్యుమెం ట్స్ కమిటీకి అందజేయాలన్నారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్ పరిశీలించి మార్కులు నిర్ణయించాలన్నారు. ఈ మార్కుల ఆధారంగా ఏప్రిల్ 30న డిస్ట్రిక్ట్ కమిటీ గ్రీన్ లీఫ్ నిర్ణయిస్తుందన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల్లో అవినీతి జరిగినట్టు రుజువుచేయండి

శాసన మండలిలో విపక్ష నేత బొత్స



విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతుల విషయంలో అవినీతి జరిగిందని రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను రుజువు చేయాలని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ సవాల్ చేశారు. బీచ్‌రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయలేకపోవడంతో కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. విపక్ష నేతలపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టును ఖండిస్తున్నామని అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇంకా పాలనగాడిలో పడలేదన్నారు. ఒక్కో శాఖలో ఏడు వేలు నుంచి పది వేల ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు చెప్పడం చూస్తే..అధికారులకు, మంత్రులకు మధ్య సమన్వయం లేదని అర్థమవుతోందన్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లోనూ దారుణంగా విఫలమైందని విమర్శించారు. విద్యారంగాన్ని గాలికి వదిలేశారన్నారు.ఇంగ్లీష్ బాషపై పట్టున్నవారికే ఉన్నతోద్యాగాలు దక్కుతున్నాయని నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొందని, కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇంగ్లీష్ మీడియాన్ని ఎత్తేసిందన్నారు. రుషికొండపై ప్రభుత్వ భవనాలను నిర్మించామని, అందులో ఏమైనా అవినీతి జరిగితే నిరూపించాలన్నారు. నిత్యావసరాల ధరలు ఒకవైపు పెరిగిపోతుంటే...మరోవైపు రైతులు పండించిన పంటలకు మద్ధతు ధర దక్కడం లేదన్నారు. వేసవి ఇంకా మొదలవకముందే పవర్‌కట్‌లు మొదలయ్యాయని విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పాల్గొన్నారు.

స్వీట్ దుకాణంలో మహిళ మృతి



రక్షణకుమారి (ఫైల్)

తగరపువలస, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తగరపువలసలో ఒక స్వీట్స్ తయారీ దుకాణంలో పని చేస్తున్న పోలిపల్లి రక్షణ కుమారి (32) అనే కార్మికురాలు తీవ్రమైన అనారోగ్యానికి గురై అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లికి చెందిన రక్షణకుమారి, మరో ఐదుగురు మహిళలు తగరపువలసలోని స్వీట్స్ తయారీ దుకాణంలో పని చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఒంట్లో బాగోలేదని చెప్పి టాబ్లెట్ వేసుకుంది. ఆ తర్వాత కుప్పకూలింది. దుకాణ యజమాని, సిబ్బంది తక్షణమే ఆమెను సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. గ్యాస్ట్రిక్ పెయిన్‌గా ఉందని రక్షణకుమారి టాబ్లెట్ వేసుకుందని, నొప్పి తగ్గుతుందని తామంతా భావించామని, కానీ ఇంతలోనే మృతి చెందిందని సహచర కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై మృతురాలి భర్త శివకుమార్ భీమిలి పోలీసులకు రాత్రి ఫిర్యాదు చేశారు. రక్షణకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుధాకర్ తెలిపారు. తల్లి అకాల మరణంతో ఇద్దరు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వైభవ వెంకన్న స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని రామాలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముడుపులను (ప్రతిజ్ఞలు కట్టడం) కట్టుకునేందుకు గురువారం భక్తులు పోటెత్తారు. దైవానుగ్రహం కోరుకునే భక్తుల సంఖ్య పెరుగుతూనే వారం వారం పెరుగుతూ వస్తోంది. అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 81 మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి ముడుపులు చెల్లించారు. ఆలయ అర్చకులు నల్లచెరువు రామకిషోర్ ఆచార్యులు ముడుపు సంప్రదాయం ప్రాముఖ్యతను చెబుతూ, ఈ ఆచారం వెంకన్న స్వామిపై భక్తులకు అచలంచలమైన నమ్మకానికి ప్రతీక అన్నారు. ఈ పవిత్రమైన ఆచారంపై భక్తులు వారి విశ్వాసాన్ని బలపరచుకున్నారు. ఆలయంలో ముడుపు కట్టుకోవడం వల్ల కోరిన కోర్కెలు నెరవేరుతాయని, కుటుంబాల్లో ఐశ్వర్యం చేకూరుతుందని భక్తులు విశ్వసిస్తున్నారన్నారు. ప్రజల్లో పెరిగిన విశ్వాసాన్ని చూసిన గ్రామ సేవా సంఘం వారు పెరుగుతున్న భక్తుల సంఖ్యను అనుగుణంగా ఎటువంటి లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్టు సబబే

సిరిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఒక నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు మరో నేరానికి పాల్పడిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టుపై ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయాన్ని తగులబెట్టించి, దాడులు చేయించారని గుర్తుచేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయ ఉద్యోగి, దళిత యువకుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేయించి చంపుతానని బెదిరించడం తగదన్నారు. కేసు విత్ డ్రా చేసుకునేలా న్యాయమూర్తి ముందు తప్పుడు వాంగ్మూలం ఇప్పించారన్నారు. వంశీ గత చరిత్ర అంతా నేరమయమన్నారు. జగన్ గ్యాంగ్‌లో చేరి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు.

ఏయూను సందర్శించిన సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు



వాసూరావును సత్కరిస్తున్న వీసీ, రెక్టార్ తదితరులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూను ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ జి.శశిభూషణరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వాసూరావును వీసీ సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ఆచార్య డి.నగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగంలో దామోదరం సంజీవయ్య జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ సంగీత దర్శకులు సాలూరు వాసూరాను మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత అందరూ నీతి నియమాలతో జీవిస్తూ, ఆదర్శవంత పౌరులుగా నవసమాజ నిర్మాణానికి మార్గదర్శకత్వం వహించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహారావు మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు అవినీతి ఎరుగని నాయకుడు దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. ఆయన పాటించిన రాజకీయ విలువలు ఆదర్శణీయమన్నారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ తన తల్లి కోరిక మేరకు రాష్ట్రంలో వృద్ధాప్య పెన్షన్ ప్రారంభించిన మహోన్నత వ్యక్తి అని, సామాజిక న్యాయం కోసం పరితపించిన నాయకుడన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వీ రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రంగనాథరావు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఏయూలో ఎన్ఎస్‌యూ ఫ్లోరిడా ప్రతినిధులు



చర్చిస్తున్న బృందం ప్రతినిధులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూను నోవా సౌత్ ఈస్ట్రన్ యూనివర్సిటీ (ఎన్ఎస్‌యూ) అసిస్టెంట్ డైరెక్టర్, జోసెఫ్ స్లిబాతో కూడిన బృందం గురువారం సందర్శించింది. ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావుతో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న నూతన కోర్సులు, ప్రత్యేక అంశాలను పరస్పరం చర్చించారు.

వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్‌ను కలిసిన చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ ప్రధాన ఇంజనీరుగా నియమితులైన వినయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీఎంఆర్డీఏ చైర్మన్‌ను ఎంవీప్రణవ్‌గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ పలు అంశాలపై మాట్లాడుకున్నారు. వీఎంఆర్డీఏ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్టులు అన్నీ గడువులోగా పూర్తి చేయాలని చైర్మన్ సూచించారు.

డాక్‌యార్డ్‌లో బొల్లార్డ్ పుల్ టగ్ 'అశ్వ' ప్రారంభం



బొల్లార్డ్ పుల్ టగ్ 'అశ్వ'ను ప్రారంభిస్తున్న నేవీ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నేవల్ డాక్‌యార్డ్‌లో 25 టన్నుల సామర్థ్యం కలిగిన బొల్లార్డ్ పుల్ టగ్ 'అశ్వ'ను రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ ప్రారంభించారు. నేవీ నౌకలు, సబ్‌మెరైన్లకు బెర్తింగ్, అన్ బెర్తింగ్ సమయాల్లో ఈ టగ్‌లు అవసరమవుతాయి. నేవీ కోసం ఆరు టగ్‌ల నిర్మాణానికి కోల్‌కతాకు చెందిన టిటాఘర్ రైల్ సిస్టమ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంది. కొత్త అశ్వ టగ్‌తో కలిపి ఇప్పటివరకూ మూడింటిని తయారుచేసి ఇచ్చారు. వీటిని నేవీ నిబంధనలకు అనుగుణంగా రూపొందించారు. నౌకల్లో అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఫైర్ ఫైటింగ్‌లో కూడా ఈ టగ్‌లను ఉపయోగిస్తారు. సముద్రంలో తప్పిపోయిన వారిని, వెదికి పట్టుకోవడంలోను వినియోగిస్తారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా వీటిని తయారుచేశారని నేవీ వర్గాలు తెలిపాయి.



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు నాయుడు

సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు వృత్తి ఆధారిత శిక్షణ అందించేందుకు నగర వ్యాప్తంగా శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు శ్రీసత్యసాయి సేవా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. తాజాగా విశాఖ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థలు, విశాలాక్షినగర్ శ్రీసత్యసాయి సేవా సమితి సంయుక్తంగా విశాలాక్షినగర్ శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ద్వారా ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ తరగతులను గురువారం ప్రారంభించినట్టు తెలిపింది. ఆ ప్రాంతంలోని రామాలయం ఆవరణలో ఈ శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొంది. విశాఖ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు శిక్షణను ప్రారంభించారని సంస్థ పేర్కొంది. 40 రోజుల పాటు నిర్వహించే ఈ కేంద్రంలో 70 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతారని తెలిపింది. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం మహిళా సమన్వయకర్త బి.అమ్మాజీ, విశాఖ సిటీ కన్వీనర్ డీవీవీ సీతారామరాజు, పురుషుల విభాగం సమన్వయకర్త సత్యనారాయణ, విశాలాక్షినగర్ భజన మండలి కన్వీనర్ వేణుగోపాల్, భక్తులు, పదాధికారులు పాల్గొన్నారు.

యారాడ ఘాట్ రోడ్డులో శివలింగం వద్ద నాగుపాము



శివలింగం చిత్రం వద్ద నాగుపాము

సింధియా, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): యారాడ ఘాట్ రోడ్డులో గల రిటెయినింగ్ వాల్‌పై చిత్రీకరించిన శివలింగం వద్దకు గురువారం నాగుపాము రావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించిన ప్రజలంతా ఒక్కసారిగా తన్మయత్వానికి లోనయ్యారు. పలువురు భక్తులు నాగుపాముకు నమస్కరిస్తూ కాసేపు అక్కడే ఉన్నారు. ఈ సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు అక్కడకు చేరుకుని ఎంతో నేర్పుగా ఆ పామును పట్టుకుని సమీపంలో ఉన్న పొదల్లో విడిచిపెట్టారు.

లింగ వివక్షపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డాక్టర్ దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ ఏయూ, జాతీయ సేవా పథకం యూనిట్-2, ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల సంయుక్తంగా గురువారం లింగ వివక్షపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ తెనాలి సాంబశివరావు హాజరై జెండర్ సెన్సిటైజేషన్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత నైటింగేల్‌గా పిలవబడుతున్న సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహించుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. సమాజం పురోగమించాలంటే, అందరూ సమాన హక్కులు, సమాన అవకాశాలతో, సమాన గౌరవంతో ఉండాలని, కానీ పురుషులు, మహిళలు, ఇతర లింగానికి చెందిన వ్యక్తుల మధ్య అసమానతలు, వివక్ష ఇంకా కనిపిస్తూనే ఉన్నాయన్నారు. అపోహలు, కట్టుబాట్లు, లింగ వివక్షను గుర్తించి, సమానత్వాన్ని పెంపొందించే విధంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంచడం, వ్యక్తిగతం, కుటుంబ స్థాయి, సమాజ స్థాయిలో మార్పును తీసుకువచ్చే సానుకూల దృక్కోణం కలిగి ఉండటమే జెండర్ సెన్సిటైజేషన్ అని తెలియజేశారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ బొరుగడ్డ సుబ్బయ్య జెండర్ సెన్సిటైజేషన్ ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ ఎ.ప్రభాకర్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే లింగ సమానత్వంపై అవగాహన కల్పించాలని, స్కూళ్లు, కళాశాలలు, పని ప్రదేశాల్లో జెండర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

విద్యార్థులకు పాలు పంపిణీ



ఎంఎల్‌బీటీ స్కూలు విద్యార్థులకు పాలు పంపిణీ చేస్తున్న ఏబీసీ ట్రస్టు ప్రతినిధులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : అన్నదానం బంగారం చారిటబుల్ (ఏబీసీ) ట్రస్టు గురువారం ఈస్ట్ పాయింట్ కాలనీలో గల ఎంఎల్‌బీటీ గాయత్రి విద్యా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు పాలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి, పారిశ్రామికవేత్త సుభాశ్‌చంద్ర మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం కోసం పోషకాహారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. పిల్లల్లో శారీరక, మానసిక ఉల్లాసానికి తమ ట్రస్టు కృషి చేస్తోందన్నారు. పిల్లల ఎదుగుదలకు సరైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏయూలో జాతీయ మహిళా దినోత్సవం



దుర్గాబాయి దేశముఖ్‌కు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా విద్య ప్రాధాన్యం, మహిళా సాధికారిత అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం ఏయూ మహిళా హాస్టల్స్‌లో విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఐటీఐ అభ్యర్థులకు జాబ్‌మేళా

కంచరపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో శుక్రవారం ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. జాబ్‌మేళాలో దుబాయ్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులుపాల్గొంటారన్నారు. ఐటీఐలో ఫిట్టర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్ తదితర ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు హాజరుకావచ్చునన్నారు. అర్హత గల విద్యార్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు వివరాలకు 9121983798 ఫోన్ నంబర్‌ను సంప్రతించాలని కోరారు.

'పార్టీని బలోపేతం చేయాలి'

సీతమ్మధార, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైసీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు అన్నారు. గురువారం తనను కలిసిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బానాల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ అల్లు శంకరరావు, కోశాధికారి కె.అనిల్ కుమార్‌లను కేకే.రాజు అభినందించారు. ఈ సందర్భంగా కేకే రాజును వారు సత్కరించారు.

క్రికెట్‌లో సిటీ పోలీసు గెలుపు

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వీడీసీఏ నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ వార్షిక లీగ్ టోర్నీలో గురువారం జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో సిటీ పోలీసు ఆరు వికెట్ల తేడాతో ఇన్‌కంటాక్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇన్‌కం టాక్స్ నిర్ణీత 18 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 120 పరుగులు చేసింది. డి.రాజేంద్ర (23) మినహా మిగిలినవారు రాణించలేకపోయారు. సిటీ పోలీసు బౌలర్లలో కె.శివ మూడు వికెట్లు పడగొట్టగా ఎల్.శ్రీను, ఎ.దేవుడు అప్పన్న చెరో రెండు వికెట్లు తీశారు. 121 పరుగుల లక్ష్యాన్ని సిటీ పోలీసు 12.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. వి.త్రినాథ్ అజేయ అర్థ సెంచరీ, ఎం.సంతోష్ (26) రాణించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు.

ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో రామారావు, హెచ్‌ఎం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను గురువారం సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి ఎం. రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తంచేశారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఆర్పీ భాగ్యలక్ష్మి ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. నందగిరినగర్, శ్రీనివాసనగర్, చెక్కుడురాయి బిల్డింగ్, వెంకటరాజు నగర్, సుబ్బలక్ష్మీనగర్, రైల్వేన్యూ కాలనీ ప్రధాన రహదారి, రైల్వే క్వార్టర్స్, రైల్వే హెచ్‌టీ సర్వీస్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని చెప్పారు.

స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్‌పై కలెక్టర్ సమావేశం

మహారాణిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఆతిథ్య సంస్థలు, అతిథి సౌకర్యాలు, భద్రతా నిర్వహణ, పారిశుధ్యం మెరుగుపరిచే పద్ధతులను అనుసరించాలన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, జడ్పీ సీఈవో, జిల్లా పర్యాటక శాఖాధికారి, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్‌తో సహా పలు విభాగాల అధికారులతో కమిటీని నియమించారు. షెడ్యూల్ ప్రకారం మూడు దశల్లో కార్యక్రమాలుంటాయని కలెక్టర్ తెలిపారు. ఓరియంటేషన్ వర్క్‌షాప్‌లు నిర్వహించి, సేఫ్టీ శానిటేషన్, ఈకో టూరిజం, ఆతిథ్య నియమావళిపై వివరిస్తామన్నారు. వాలంటరీ డిక్లరేషన్‌లో భాగంగా శానిటరీ పారామీటర్స్, సపోర్టింగ్ డాక్యుమెంట్స్ కమిటీకి అందజేయాలన్నారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్ పరిశీలించి మార్కులు నిర్ణయించాలన్నారు. ఈ మార్కుల ఆధారంగా ఏప్రిల్ 30న డిస్ట్రిక్ట్ కమిటీ గ్రీన్ లీఫ్ నిర్ణయిస్తుందన్నారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి నేతల శుభాకాంక్షలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన జీవీఎంసీ వైసీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావును పలువురు శుభాకాంక్షలు తెలిపారు.గురువారం నందగిరినగర్‌లోని బానాల ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. గని, వెంకటరావు, పిడుగు వెంకట్, బాధ శ్రీనివాస్, మహాదాస్యం గోపి, జేమ్స్, యుగంధర్, మణకంఠ తదితరులు ఉన్నారు.

ఆటోవాలాల ఇష్టారాజ్యం

- పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు
- విద్యార్థులతో కిక్కిరిసి పోతున్న వైనం
- పట్టించుకోని పోలీసు అధికారులు



ఆటోలో పరిమితికి మించి విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కొంతమంది డ్రైవర్లు ఆటోలను నిర్లక్ష్యంగా నడుపుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాపుల వద్ద అడ్డంగా ఆటోలను నిలిపివేస్తున్నారని, ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడబడితే అక్కడ ఆటోలను ఆపి వెనుక వస్తున్న వారికి ఇబ్బంది కలిగిస్తున్నారంటున్నారు. వెళ్తున్న ఆటో సడన్‌గా ఆప డంతో వెనుక నుంచి వస్తున్న వాహనాలు, పాదచారులు ఆటోలను ఢీకొట్టి ప్రమాదాల కు గురవుతున్నారంటున్నారు. ఆటోలో ముగ్గురి కి మించి తీసుకెళ్లరాదన్న నిబంధన ఉన్నా, డ్రైవ ర్లు పరిమితికి మించి ముందు, వెనుక ఎక్కువమందిని తీసుకెళ్తున్నారని, ముఖ్యంగా చిన్నారులను కిక్కిరిసి కూర్చోబెట్టి తరలిస్తున్నారని, దు రదృష్టవశాత్తూ ప్రమాదం జరిగితే ఎవరు బా ధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. స్కూల్ ఆటో అయితే చెప్పనక్కర్లేదు. డ్రైవర్ పక్కన ఇరువైపు లా ఇద్దరిని, బేబీ సీటులో నలుగురిని, మెయిన్ సీటులో నలుగురిని, వెనుక నలుగురిని మొత్తం 14 మందిని కిక్కిరిసి తరలిస్తున్నారు. దీనివల్ల చిన్నారులు పూర్తిగా అలసిపోయి ఒళ్లు నొప్పుల తో బాధపడుతున్నారు. రోడ్డుపై ఆటో వెళ్లేటప్పు డు స్పీడ్ బ్రేకర్ దగ్గర సడన్ బ్రేక్ వేస్తే లోపల ఉన్న విద్యార్థులంతా తుళ్లి కింద పడిపోయే ప్ర మాదం ఉందని, అయినాపట్టించుకోవడం లేదంటున్నారు. యూటర్న్ తీసుకునే సమయంలోనే ఇదే పరిస్థితి ఉందని, కొంతమంది ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల తమ పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ యాజమాన్యం కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. దొండపర్తి, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, కైలాసపురం, మధుసూదన్‌నగర్, ఎన్‌జీజీఓస్ కా లనీ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖాధికారులు జరిమానా విధించినా డ్రైవర్ల తీరు మారడం లేదు. ఏదైనా దుస్సంఘటన జరిగితే తప్ప అధికారులు స్పందించడం లేదని, మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కళ్ల ముందే కిక్కిరిసి, ప్రమాదకర పరిస్థితుల్లో ఆటోల్లో జనాన్ని తరలిస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆటో వాలాలు పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణికులను తరలిస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- మహిళా డిగ్రీ కళాశాల వసతిగృహం సందర్శన



కాలేజీ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్య, విద్యార్థుల ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న వసతిగృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. అక్కడ పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని విధాలుగా తర్ఫీదునివ్వాలని, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యేలా సన్నద్ధం చేయాలని సూచించారు. వసతిగృహంలో అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. తదుపరి కృష్ణా కళాశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. కృష్ణానగర్ పరిధిలోని మలేరియా నియంత్రణ కార్యాలయాన్ని సందర్శించారు. మలేరియా నివారణలో భాగంగా వారు పాటిస్తున్న పద్ధతులు, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డీఈఓ, మలేరియా నివారణ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రాన్ని ఇస్తున్న స్రవంతి

కంచరపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54 వార్డులో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు టీడీపీ నాయకురాలు పెంటకోట స్రవంతి గురువారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. వార్డులో గత వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, గ్రీన్‌బెల్ట్‌లో పార్కుల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, నూతన సీసీ రోడ్లు వేయడం, గెడ్డలకు రక్షణ గోడల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపట్టాలని కోరా రు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు, సనపల వరప్రసాద్, బీజేపీ మండల నాయకుడు గుజ్జి నారాయణ, రాజు తదితరులు ఉన్నారు.

34వ వార్డులో పారిశుధ్య కార్మికుల నిరసన



వివరాలు తెలుసుకుంటున్న జడ్సీ మల్లయ్యనాయుడు

అల్లిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పనులు నిలిపివేసి జీవీఎంసీ 34వార్డులో పారిశుధ్య కార్మికులు గురువారం నిరసన తెలిపారు. నేతాజీనగర్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుడు కాకరరాజును స్థానిక వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో తోటి కార్మికులు ఆందోళనకు దిగారు. వీరికి జోన్-4 పరిధిలోని అన్నివార్డుల కార్మికులు మద్దతు పలుకుతూ ఎక్కడి పనులు అక్కడ నిలిపివేశారు. దీంతో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని దాడిచేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కేసు నమోదు చేస్తామని, దాడి చేసిన వ్యక్తి ఇంటి నుంచి వారం రోజుల పాటు చెత్తను సేకరించవద్దని కార్మికులకు సూచించారు. బాధితుడికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు నిరసన విరమించారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న చిరు వ్యాపారులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను గుప్పెట్లో పెంటుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ హెచ్చరించారు. పూర్ణామార్కెట్‌లో ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులు గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా 120 మంది కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నామని రోజుకు రూ.200 నుంచి రూ.300 అద్దె చెల్లిస్తున్నామన్నారు. జీవీఎంసీకి మాత్రం రూ.20 ఆశీలు వసూలు చెల్లించే దళారుల చేతిలో అనేక దుకాణాలున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వారు తమకు అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారని వివరించారు. అనేక మంది బినామీల పేర్లతో దౌర్జన్యంగా దుకాణాలు చేజిక్కించుకున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అన్ని వివరాలు పరిశీలించి ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. బినామీ పేర్లతో దుకాణాలు గుప్పెట్లో పెట్టుకుని వాటిని ఇతరులకు అద్దెకు ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రకృతి వనరుల పరిరక్షణకు యువత సహకరించాలి



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను పరిరక్షించి, భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించేలా యువత కృషిచేయాలని నన్నయ్య వర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ సుంకరి రామకృష్ణారావు అన్నారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డా.కె.మాణిక్యకుమారి అధ్యక్షతన, వ్యాస్ సంస్థ కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంస్థతో కలిసి గురువారం నిర్వహించిన యూత్ యాక్షన్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, భూమి మీద మాత్రమే జీవి మనుగడ సాగిస్తోందన్నారు. మొక్కలు నాటడంతో పాటు అడవులు, కొండల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నదులు, సముద్రాల్లో హానికర రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు చేరకుండా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ఏయూ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఈయూబీ రెడ్డి, డాక్టర్ ఓ.భానుకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ వీకే జయలక్ష్మి, డాక్టర్ ఎం.పద్మ, హనీ, దివ్య, రత్నం, కృష్ణకుమారి పాల్గొన్నారు.

వందేభారత్‌కు ఏలూరులో హాల్ట్ కొనసాగింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరు స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన హాల్ట్‌ను మరో ఆరు నెలలపాటు కొనసాగించనున్నామని వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వచ్చే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20707) ఉదయం 9.49 గంటలకు ఏలూరు స్టేషన్‌కు చేరి...తిరిగి 9.50 గంటలకు బయలుదేరుతుంది. ఇక విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708) సాయంత్రం 5.44 గంటలకు ఏలూరు స్టేషన్‌కు చేరి, తిరిగి 5.45 గంటలకు బయలుదేరుతుంది. ఇరువైపులా కేవలం ఒక నిమిషం మాత్రమే హాల్ట్ కల్పించారు.

సింహాచలం దేవస్థానం స్థలాలు స్వాధీనం



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న దేవస్థానం అధికారులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు గణేష్‌నగర్‌లోని కొండ ప్రాంతంలో ఖాళీ స్థలాలను సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు ఆధ్వర్యంలో అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవో త్రినాథరావు విలేకర్లతో మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి చెందిన సర్వే నంబరు 270లో 16.2 ఎకరాల ఖాళీ స్థలాలున్నాయన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 42 ప్లాట్లను (7200 గజాలు) స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో ఆక్రమించిన వారు గణేష్ సేవా సంఘం సహకారంతో కోర్టులో కేసు వేయగా కోర్టు దానిని డిస్మిస్ చేసిందన్నారు. దీంతో తాము స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిలో బోర్డులు పెట్టినట్టు చెప్పారు. స్థలాలను పరిరక్షించేందుకు చుట్టూ ఫెన్సింగ్ వేస్తామన్నారు. దేవస్థానానికి చెందిన స్థలాన్ని ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాశీ అసోసియేట్స్ అధినేత బొడ్డేటి కాశీ విశ్వనాథానికి చెందిన స్థలంలో బోర్డు ఏర్పా టు చేసేందుకు వచ్చిన ఈవోకు గతంలో క్రమబద్ధీకరించడానికి అవకాశమిచ్చిన ప్రభుత్వానికి చెల్లించినచలానాల డాక్యుమెంట్లు చూపించారు. దేవస్థానానికి చెందిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి 2003లో అప్పటి ప్రభుత్వం క్రమబద్ధీకరణకు అవకాశమివ్వడంతో తాను ఒక్కడినే 800 గజాల స్థలాలకు నగదు చెల్లించి రశీదులు పొందానని కాశీ విశ్వనాథం చెప్పారు. ఈవోతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీత, ఏఈవో ఆనంద్ తదితరులు ఉన్నారు.

డాక్‌యార్డ్‌లో బొల్లార్డ్ పుల్ టగ్ 'అశ్వ' ప్రారంభం



టగ్ 'అశ్వ'ను ప్రారంభిస్తున్న నేవీ అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నేవల్ డాక్‌యార్డ్‌లో 25 టన్నుల సామర్థ్యం కలిగిన బొల్లార్డ్ పుల్ టగ్ 'అశ్వ'ను రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ ప్రారంభించారు. నేవీ నౌకలు, సబ్‌మెరైన్లకు బెర్తింగ్, అన్ బెర్తింగ్ సమయాల్లో ఈ టగ్‌లు అవసరమవుతాయి. నేవీ కోసం ఆరు టగ్‌ల నిర్మాణానికి కోల్‌కతాకు చెందిన టిటాఘర్ రైల్ సిస్టమ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంది. కొత్త అశ్వ టగ్‌తో కలిపి ఇప్పటివరకూ మూడింటిని తయారుచేసి ఇచ్చారు. వీటిని నేవీ నిబంధనలకు అనుగుణంగా రూపొందించారు. నౌకల్లో అగ్నిప్రమాదాలు జరిగినపుడు ఫైర్ ఫైటింగ్‌లో కూడా ఈ టగ్‌లను ఉపయోగిస్తారు. సముద్రంలో తప్పిపోయిన వారిని, వెదికి పట్టుకోవడంలోను వినియోగిస్తారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా వీటిని తయారుచేశారని నేవీ వర్గాలు తెలిపాయి.

సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి: సీఐ



మర్రిపాలెంలో అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కంచరపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కంచరపాలెం క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల్లో విద్యార్థులకు నేర నియంత్రణపై అవగాహనా కల్పించారు. క్షణికావేశంతో అనాలోచితంగా కొంత మంది నేరాలు చేసి, జీవితాంతం శిక్షలు అనుభవిస్తున్నారన్నారు. యువత మత్తుపదార్థాలకు బానిసైతే విచక్షణ కోల్పోయి దొంగతనాలు చేస్తు పట్టుబడుతున్నారన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ.రమణ, ఎస్ఐ సుదర్శనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై అవగాహన

మర్రిపాలెం: చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎయిర్‌పోర్ట్ క్రైమ్ సీఐ నిమ్మకాల శ్రీనివాసరావు గురువారం స్థానికులకు అవగాహన కల్పించారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపార్టుమెంటు వాసులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతుబజార్, షాపింగ్‌మాల్స్ తదితర రద్దీ ప్రాంతాల్లో చోరీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుదర్శనరావు, ప్రసాద్, మళ్ల అప్పారావు, కనకరాజు, కోటి పాల్గొన్నారు.

డీజిల్ బిల్లుపై ఆడిట్ అభ్యంతరం

... 5వ పేజీ తరువాయి

వివరాలతో సంబంధిత అధికారులు మెకానికల్ విభాగం అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. వాటితోపాటు జీవీఎంసీ వాహనాలు వినియోగించిన డీజిల్, పెట్రోల్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో మెకానికల్ విభాగం అధికారులు బిల్లు తయారుచేసి ఆడిట్ విభాగం అధికారులకు పంపిస్తే వారు సమగ్రంగా పరిశీలించి చెల్లింపునకు సిఫారసు చేస్తుంటారు. ఇదిలావుంటే గతనెలలో వినియోగించిన డీజిల్, పెట్రోల్‌కు సంబంధించిన బిల్లును మెకానికల్ విభాగం అధికారులు ఆడిట్ విభాగానికి పంపించగా, అక్కడ ఫైల్‌ను పరిశీలించి కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. సాధారణంగా వచ్చే బిల్లు కంటే అదనంగా రావడంతో...వినియోగం పెరగడానికి గల కారణాలు, ఒకవేళ అదనంగా వాహనాలను వినియోగించినట్టయితే వాటి వివరాలు, ఒకవేళ గతంలో బకాయిలను ఇప్పుడు బిల్లులో కలిపినట్టయితే అవి సమర్పించాలని కోరినట్టు సమాచారం. దీంతో బంకు ఖాతాలో అడ్వాన్స్ కింద జీవీఎంసీ ఉంచిన రూ.2 కోట్లను బంకు యజమాని అప్పటివరకూ తాను సరఫరా చేసిన డీజిల్, పెట్రోల్‌కు సర్దుబాటు చేసుకున్నారు. అడ్వాన్స్ మొత్తాన్ని జమ చేసేంత వరకు డీజిల్, పెట్రోలు సరఫరా చేయలేనని చేతులెత్తేశారు.

జోన్-2 పరిధిలో క్లాప్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి సేకరించే చెత్తను నేరుగా కాపులుప్పాడలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ప్రహరీ గోడ వద్ద డంప్ చేస్తాయి. అక్కడి నుంచి ఆ చెత్తను ప్రొక్లెయిన్‌లు లారీల్లో లోడ్ చేస్తే...అవి తీసుకువెళ్లి ప్లాంటులో గల ర్యాంప్‌లో అన్‌లోడ్ చేస్తాయి. ఇందుకోసం అక్కడ రెండు ప్రొక్లెయినర్లు, మూడు లారీలు ఉన్నాయి. డీజిల్ లేకపోవడంతో ప్రొక్లెయినర్లు, మూడు లారీలు నిలిచిపోయాయి. క్లాప్ వాహనాలు ప్రస్తుతం చెత్తను తీసుకువెళ్లి వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు ప్రహరీ ముందు అన్‌లోడ్ చేసి వెళ్లిపోతుండడంతో అక్కడ కుప్పలు పేరుకుపోతున్నాయి.

పరస్పర ఆరోపణలు

బిల్లుపై ఆడిట్‌లో అభ్యంతరాలు రావడానికి మీరు కారణమంటే మీరే కారణమంటూ మెకానికల్, ప్రజారోగ్యం విభాగాల అధికారులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఫాగింగ్‌కు వినియోగించే డీజిల్, పెట్రోల్ బిల్లును సాధారణం కంటే నెలకు రూ.30 లక్షలు అదనంగా పెంచి ప్రజారోగ్య విభాగం నుంచి పంపించారంటూ మెకానికల్ విభాగం అధికారులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న బకాయిలను ఇప్పుడు చెల్లించాలంటూ ప్రస్తుత బిల్లుతో కలిపి మెకానికల్ విభాగం అధికారులు పంపించడం వల్లే ఆడిట్‌లో అభ్యంతరాలు వచ్చాయని ప్రజారోగ్యవిభాగం అధికారులు ఆరోపిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలు, వినియోగంపై తలెత్తిన పంచాయితీ ఇన్‌చార్జి కమిషనర్ దృష్టికి చేరడంతో ఇరు విభాగాల అధికారులతోపాటు ఆడిట్ విభాగం అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారంపై దృష్టిపెట్టాలని ఆదేశించినట్టు తెలిసింది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో పది మంది...

... 5వ పేజీ తరువాయి

ఓటర్లు (పురుషులు 13,508 మంది, మహిళలు 8,985) మంది ఉన్నారన్నారు. మొత్తం 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూర్చున్నామని, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటుచేస్తున్నామన్నారు. పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇస్తున్నామని, ఓటర్లకు వివరాలతో స్లిప్పులు అందజేస్తామన్నారు. పోలింగ్ తరువాత బ్యాలెట్ బాక్సులు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరుస్తామని, మార్చి 3వ తేదీన అక్కడే ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రచారం నిర్వహించకూడదని కలెక్టర్ అన్నారు. విలేకరుల సమావేశంలో డీసీపీ అజితా వేజెండ్ల, డీఆర్వో భవానీశంకర్ పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పూర్ణామార్కెట్ రోడ్డులో ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యతోపాటు వాహనంపై వస్తే ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితి ఉండేదని, దీనిపై జీవీఎంసీ, పోలీస్ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినాసరే ఫలితం లేకపోయిందని, ఇప్పుడు ఆక్రమణలను తొలగించడంతో అన్నివిధాలుగా సౌకర్యంగా ఉందని సీనియర్ సిటిజన్ ఒకరు సీపీకి వివరించారు. ఈ నేపథ్యంలో నగరంలో రోడ్ల ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టు స్పెషల్‌డ్రైవ్ కొనసాగిస్తామని సీపీ వివరించారు. ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామన్నారు. అందుకు జీవీఎంసీతోపాటు ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటామన్నారు. వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా చూపించేందుకు నగరంలో హాకర్‌జోన్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జూన్ నాటికి ఫ్లైఓవర్

... 5వ పేజీ తరువాయి

గంటల తరువాత మాత్రమే అనుమతిస్తున్నారు. దాంతో సరకులు తెప్పించుకునే వ్యాపారులు సకాలంలో డెలివరీ కాక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కాంకర్ చొరవ చూపింది. విశాఖ పోర్టు యాజమాన్యంతో మాట్లాడి విమానాశ్రయం జంక్షన్ సమీపాన ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భారత జాతీయ రహదారుల సంస్థతో కలిసి రూ.58.73 కోట్లతో ఫ్లైఓవర్ పనులు గత ఏడాది ఆగస్టులో ప్రారంభించింది. ఈ పనులు ఈ నెల 13వ తేదీ నాటికి పూర్తి కావలసి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పనులు వేగవంతంగా జరగడం లేదు. దాంతో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దీనిపై రెండు రోజుల క్రితం పార్లమెంటులో ప్రశ్నించారు. జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ జూన్ నాటికి ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తుందని సమాధానమిచ్చారు.

ఇకపై ఇబ్బందులు ఉండవు

కాంకర్ నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వల్ల షీలానగర్, విమానాశ్రయం జంక్షన్లలో రహదారులపై ఇక కంటెయినర్ ట్రెయిలర్లు కనిపించవు. అవి కొత్తగా వచ్చే ఫ్లైఓవర్ పైనుంచే రాకపోకలు సాగిస్తాయి. సమయం కలిసి వస్తుంది. త్వరగా సరకులు గమ్యస్థానాలకు చేరతాయి.

- జి.సాంబశివరావు, శ్రవణ్ షిప్పింగ్ అధినేత

మహా అత్యాశ

... 5వ పేజీ తరువాయి

చక్కటి సదుపాయం లభిస్తుంటే దానిని ఎలా అడ్డుకుంటారని చీవాట్లు పెట్టారు. అమృత్ పథకం కింద పనులు కూడా ఇలాగే చేస్తున్నారా? అని ప్రశ్నించారు. దాంతో జీవీఎంసీ అధికారులు మళ్లీ అంచనాలు రూపొందించి ఇస్తామని చెప్పారు. అప్పటి వరకూ పనులు ఆగిపోవలసిందేనా?...అని ఈపీడీసీఎల్ అధికారులు ప్రశ్నించగా...నగర శివార్లలో ఉన్న కచ్చా రోడ్లలో పనులు చేసుకోవచ్చునని, వాటికి ఎటువంటి రుసుము వసూలు చేయబోమని సమాధానమిచ్చారు.



పెందుర్తిలో క్రీడలకు స్థలం కరువాయె..

» పదిహేనేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం
» ఆటాడుకునేందుకు చోటు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న క్రీడాకారులు
» ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

పెందుర్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలు అంటే అందరికి ఆసక్తే.. యువత అయితే క్రీడల పట్ల మరింత ఉత్సాహాన్ని కనబరుస్తారు. కానీ పెందుర్తి ప్రాంతంలో ఆటాడుకునేందుకు స్థలమే కరువాయె. ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామని ప్రతిపాదన చేసి పదిహేనేళ్లవుతున్నా దానికి కదలికే లేకుండా పోయింది. చినముషిడివాడ సమీపం వుడా కాలనీ వద్ద గల ఆరు ఎకరాల స్థలాన్ని స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనువైనదిగా అప్పట్లో గుర్తించారు. నాటి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించడం.. నాటి వుడా అధికారులు ఇందుకోసం రూ.మూడు కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ముందుకు రావడం జరిగింది. అయితే ఆ తర్వాత ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగకపోవడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది. అనంతరం ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్య నారాయణమూర్తి పెందుర్తి ప్రాంతంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని ప్రకటించినా.. అదీ కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పెందుర్తిలో కాకుండా బండారు సొంత మండలమైన పరవాడలో ఇండోర్ స్టేడియంను నిర్మించడం గమనార్హం. కాగా 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పలు సందర్భాల్లో పెందుర్తిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించి తీరుతామని ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు.

పంచకర్ల గారూ.. ఈసారైనా స్పోర్ట్స్ కాంప్లెక్స్ కల నెలవేరేనా.!



2009లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తిలో స్పోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. మళ్లీ ఇప్పుడు ఆయే నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడంతో ఈసారైనా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కల నెరవేరుతుందా అని యువత ఆశగా ఎదురుచూస్తున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఈసారైనా పంచకర్ల చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎందువల్లో నిర్మించడం లేదో..

మండలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఎందుకు నిర్మించడం లేదో అర్థం కావడం లేదని యువత ఆవేదన వ్యక్తం చేస్తుంది. అన్ని వనరులు ఉన్నా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్లే స్పోర్ట్స్ కాంప్లెక్స్ కల సాకారం కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 15 పంచాయతీలు, 8 వార్డులు 25 లక్షల మంది జనాభా గల నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పెందుర్తిలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం విచారకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా స్పోర్ట్ కంప్లెక్స్ ఏర్పాటు మాత్రం కలగానే మిగిలిపోతుందని వాపోతున్నారు. స్థానికంగా క్రీడా మైదానం కరువవ్వడంతో చిన్నారులు, విద్యార్థులు ఆన్‌లైన్ పరిమితమవుతున్నారని, దీంతో చిన్నారులు, యువతకు శారీరక వ్యాయామం కూడా ఉండడం లేదని పలువురు క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ఒలింపిక్ ప్రమాణాలతో నిర్మించాలి

-రాయవరపు స్వరూప్, రాష్ట్ర అథ్లెటిక్స్ క్రీడాకారుడు, పెందుర్తి



పెందుర్తిలో క్రీడల్లో యువత సాధన చేసేందుకుగాను స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒలింపిక్ ప్రమాణాలకు అనుగుణంగా స్పోర్ట్స్ స్టేడియాన్ని ఏర్పాటు చేస్తే జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులు తయారవుతారు. అందుబాటులో ఎటువంటి మైదానం లేకపోవడంతో స్థానిక క్రీడాకారులు సాధన కోసం నగరానికి వెళ్లాల్సి వస్తుంది. ఇది దూర, వ్యయ భారంగా మారుతుంది. అందువల్ల ఒలింపిక్ ప్రమాణాలతో స్థానికంగా సోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.



బుచ్చిరాజుపాలెం గవర వీధిలో రోడ్డును మూసివేసి గోడ నిర్మించిన రైల్వే అధికారులు

బుచ్చిరాజుపాలెం రైల్వే క్యాబిన్ రహదారి మూసివేత

పాదచారులు నడిచేందుకు వీలుగా చిన్న మార్గం ఏర్పాటు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం గవరవీధిలో రైల్వే క్యాబిన్‌కు వెళ్లె రహదారిని మూసివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. బుచ్చిరాజుపాలెం గవరవీధి చివర రైల్వే లైన్ వద్ద సిగ్నలింగ్ క్యాబిన్ ఉండేది. దీనికి వెళ్లే ఉద్యోగులు, ఇతర అవసరాలకు వెళ్లే స్థానికులు ఈ రహదారిని వాడేవారు. ప్రస్తుతం రైల్వే శాఖ అధికారులు పూర్తిస్థాయి రహదారి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుచ్చిరాజుపాలెం క్యాబిన్‌కు వెళ్లెందుకు బాజీ జంక్షన్ మీదుగా రహదారి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ప్రస్తుతం స్థానికులు కేవలం నడిచి వెళ్లేందుకు వీలుగా చిన్న మార్గాన్ని గవర వీధిలో ఉంచారు.

సినిమా గైడ్

● **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
● **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
● **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
● **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 10, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 38, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)44, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 26, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 34, కీర దోస 30, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 26, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

వైభవంగా సత్యమాంబ అమ్మవారి పరస

ఆటోనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు ప్రజల ఆరాధ్య దైవం శ్రీసత్యమాంబ పరసను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించడంతో పాటు అమ్మవారికి వేకువజామునే ప్రత్యేక పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించారు. ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సత్యమాంబకు పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీధర్‌స్వామి పర్యవేక్షణలో సాయినాథునికి పంచామృతాభిషేకాలు, కాగడా హారతి, తదితర పూజాది కార్యక్రమాలను చేపట్టారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వెండి పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గాప్రసాద్, శేషగిరిరావు, ధనుంజయరెడ్డి, సాయిరాం, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సత్యమాంబ, పక్కన ఆలయ ఆవరణలోని చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నేడు సీతారాముల పరస

అక్కిరెడ్డిపాలెం: గ్రేటర్ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో ఏటా ఫిబ్రవరి 14న ఎంతో ఘనంగా నిర్వహించే శ్రీసీతారాముల పరసను శుక్రవారం జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరస సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్టు కాలనీ నాయకులు వంగలపూడి గోపి, గుమ్మడి రామాంజనేయులు తెలిపారు.

నేటి నుంచి సీతారామాలయ వార్షికోత్సవాలు

వేపగుంట: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో శ్రీసీతారామాలయ 22వ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 27 వరకు జరపనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు స్వామికి అభిషేకాలు, దివ్య ప్రబంధం, తదితర పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కళ్యాణం, సుదర్శన హోమం, సుందరాకాండ పారాయణం, అన్నదానం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు.



దుకాణాన్ని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

షాపును తొలగించవద్దంటూ మహిళ ఆవేదన

మల్కాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి పోలీస్ స్టేషన్ నుంచి శ్రీహరిపురం వరకు ఫుట్‌పాత్‌పై వందకు పైగానే దుకాణాలు ఉన్నాయి. కానీ ఏ దుకాణానికి లేని అభ్యంతరం తన షాపునకు ఎందుకు వర్తింపజేస్తూ తొలగిస్తున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. హెచ్‌పీసీఎల్ యారాడపార్కు సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌పై ఓ మహిళ కర్రీ పాయింట్ షాపును పెట్టుకుని జీవనం సాగిస్తుంది. కూరగాయల వ్యాపారం చేసినా లాభదాయంగా లేకపోవడంతో వారం రోజుల క్రితమే తాను కర్రీ పాయిట్ షాపును ప్రారంభించానని ఆమె పేర్కొంది. అయితే ఆమె షాపు ఫుట్‌పాత్‌పై అడ్డంకిగా ఉందంటూ జీవీఎంసీ సిబ్బంది గురువారం తొలగించారు. ఆ మహిళ ఎంతగా వేడుకున్నా ఫలితం లేకపోవడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. కాగా ఈ షాపు రోడ్డు పైకి వచ్చేలా ఏర్పాటు చేయడం వల్ల జీవీఎంసీకి అనేక ఫిర్యాదులు వచ్చాయని, అందుకే తాము తొలగించాల్సి వచ్చిందని సిబ్బంది చెబుతున్నారు.

ఫ్రీహోల్డ్ భూముల్లో అవినీతి జరిగినట్టు రుజువు చేయండి

» శాసన మండలిలో విపక్ష నేత బొత్స



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతుల విషయంలో అవినీతి జరిగిందని రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను రుజువు చేయాలని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ సవాల్ చేశారు. బీచ్‌రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయలేకపోవడంతో కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. విపక్ష నేతలపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టును ఖండిస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇంకా పాలనగాడిలో పడలేదన్నారు. ఒక్కో శాఖలో ఏడు వేలు నుంచి పది వేల ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం చూస్తే...అధికారులకు, మంత్రులకు మధ్య సమన్వయం లేదని అర్థమవుతోందన్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లోనూ దారుణంగా విఫలమైందని విమర్శించారు. విద్యారంగాన్ని గాలికి వదిలేశారన్నారు. ఇంగ్లీష్ భాషపై పట్టున్నవారికే ఉన్నతోద్యోగాలు దక్కుతున్నాయని నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొందని, కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇంగ్లీష్ మీడియాన్ని ఎత్తేసిందన్నారు. రుషికొండపై ప్రభుత్వ భవనాలను నిర్మించామని, అందులో ఏమైనా అవినీతి జరిగితే నిరూపించాలన్నారు. నిత్యాసరాల ధరలు ఒకవైపు పెరిగిపోతుంటే...మరోవైపు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదన్నారు. వేసవి ఇంకా మొదలవకముందే పవర్‌కట్‌లు మొదలయ్యాయని విమర్శించారు. విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ కుంభారవిబాబు పాల్గొన్నారు.

యారాడ ఘాట్ రోడ్డులో నాగుపాము



శివలింగం చిత్రం వద్ద నాగుపాము

సింధియా, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): యారాడ ఘాట్ రోడ్డులో గల రిటెయి నింగ్ వాల్‌పై చిత్రీకరించిన శివలింగం వద్దకు గురువారం నాగుపాము రావ డంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించిన ప్రజలంతా తన్మయత్వానికి లోనయారు. పలువురు భక్తులు నాగుపాముకు నమస్కరిస్తూ కాసేపు అక్కడే ఉన్నారు. ఈ సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు అక్కడకు చేరుకుని ఎంతో నేర్పుగా ఆ పామును పట్టుకుని సమీపంలో ఉన్న పొదల్లో విడిచిపెట్టారు.

స్నేహితుడి కుమార్తెకు బాసటగా నిలిచిన పూర్వ విద్యార్థులు



భాగ్యశ్రీకి రూ.లక్ష నగదు అందజేసిన సంఘం ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తమతో పాటు చదువుకుని ఇటీవల మృతి చెందిన స్నేహితుడి కుమార్తెకు స్టీల్‌ప్లాంట్ వీవీవీ స్కూల్ పూర్వ విద్యార్థులు బాసటగా నిలిచారు. ఇస్లాంపేట సమీపంలోని మదీనాబాద్ ప్రాంతానికి చెందిన వీవీవీ స్కూల్ పూర్వ విద్యార్థి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య అంతకుముందేమృతి చెందింది. వీరికి డిగ్రీ చదువుతున్న కుమార్తె భాగ్యశ్రీ ఉంది. ఆమె ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నట్టు తెలుసుకున్న వారందరూ పూర్వ విద్యార్థుల సంఘం తరపున లక్ష రూపాయలు నగదును గురువారం భాగ్యశ్రీకి అందజేశారు. అంతేకాకుండా ఆమె చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జెర్రిపోతుల మోహన్‌మార్, పూర్వ విద్యార్థులు ఎం.సత్యనారాయణ, ఎస్.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న లావు రత్తయ్య

జాతీయ స్థాయి క్రీడల్లో 'విజ్ఞాన్'కు పతకాలు

అగనంపూడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి యువజన మహోత్సవ్‌లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు విజ్ఞాన్ ముందుంటుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని విజయాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదన రావు, పీడీలు రాంబాబు, ప్రశాంత్, డీన్లు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు కృషి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రగతికి ఊతమిచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి వివరాలకు సంబంధించిన వాల్ పోస్టరును గురువారం ప్లాంటులో ఆయన ఆవిష్కరించారు. ఉక్కు కర్మాగారానికి మెరుగైన ప్యాకేజీ ఇప్పించడంలో, గనుల పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. ప్లాంటులో నెలకొన్న సమస్యలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రానున్న రోజుల్లో ప్లాంట్ మరింత ప్రగతి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్రకుమార్, కె.శివనాగేశ్వరరావు, ఎం.రఘుప్రసాద్, పి.సోమినాయుడు, పి.శ్రీను, వి.కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో నాంది ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు స్పోర్ట్స్, స్టేషనరీ కిట్‌ల పంపిణీ

గోపాలపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేహాద్రిగెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మహేంద్ర రైజ్ సంస్థ సౌజన్యంతో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో 270 మంది విద్యార్థులకు స్పోర్ట్స్, స్టేషనరీ కిట్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏఎం ప్రియదర్శిని మాట్లాడుతూ విద్యాభివృద్ధికి నాంది ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నాంది ఫౌండేషన్ పీవో వై.సత్యవతి అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎస్ఏలు కె.సత్యవతి, కె.రజని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన పూర్వ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: తాము చదువుకున్న అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ అభివృద్ధితో పాటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల ప్రగతికి 1993-94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల తమవంతు సహకారాన్ని అందించారు. గురువారం పాఠశాలలో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లోని విద్యార్థులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.కుమారస్వామి, బి.రవిచంద్, మహ్మద్ ఇస్మాయిల్‌తో పాటు పూర్వ విద్యార్థులు నంబారు రమణ, సంద్రాన చిన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గాజువాక, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గొంతినానిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కణితి రోడ్డు, చైతన్యనగర్, శాంతినగర్, గొంతినవానిపాలెం, ప్రశాంతినగర్, మోహర్‌నగర్, గ్రంథాలయం వీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి చినముషిడివాడ 33/11కేవీ రత్నగిరినగర్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ పి.శ్రీనివాస రావు తెలిపారు. అందువల్ల ఎల్ఐసీ కాలనీ, ఎన్ఏడీ లేఅవుట్, రత్నగిరి లేఅవుట్, 80 అడుగుల రోడ్డు, సూర్యానగర్, గొల్లవిల్లిపాలెం, శతాబ్ది నగర్, వైటూకే పార్కు, హైటెక్ అపార్ట్‌మెంట్, ఎస్సీ బీసీ కాలనీ, ద్రోణంరాజునగర్, అశోక్‌నగర్, సాయినగర్, సత్యానగర్, పాత ఊరు, చిన్నయ్య కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

మల్కాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం, మల్కాపురం ప్రాంతాలను మండలాలుగా విభజిస్తు బీజేపీ నూతన కమిటీలను నియమించింది. పారిశ్రామిక ప్రాంతంలో బీజేపీని బలోపేతం చేసేందుకు గాను మండల కమిటీలను నియమించారు. ఈ మేరకు గురువారం శ్రీహరిపురంలో జరిగిన బీజేపీ సమావేశంలో పలువురు ప్రతినిధులు పాల్గొని అధ్యక్షులు, ఆర్‌వోలను నియమించారు. శ్రీహరిపురం మండల అధ్యక్షుడిగా తెప్పల సతీశ్, మల్కాపురం మండల అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌ను నియమించారు. ఆర్‌వోలుగా శ్రీహరిపురానికి నాదెళ్ల జ్యోతి, మల్కాపురానికి పోలిమేర శ్రీనివాస్‌లను నియమించారు.

నేత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు



కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు, తదితరులు

అగనంపూడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నేత్రాల పట్ల విద్యార్థులంతా అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో విశాఖ కంటి ఆస్పత్రి నిర్వాహకులు చూపు లోపం ఉన్న విద్యారులకు డీఈవో చేతుల మీదగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ జ్ఞానేంద్రియాల్లో నయనం ప్రధానమైనదన్నారు. అందమైన ప్రపంచాన్ని, ప్రకృతిని కళ్లతో చూసి మనసు ఆస్వాదిస్తుందని, అటువంటి కళ్ల పట్ల అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులు సిగ్గు పడకుండా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాంకీ ప్రతినిధులు కె.శ్రీకాంత్, రాజేశ్వరి, హెచ్ఎం అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను సమాంతరంగా చేపట్టాలి

పెందుర్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రహదారి మధ్యస్తం గుర్తించి విస్తరణ పనులను సమాంతరంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ పెందుర్తిలో విస్తరణ బాధితులు గురువారం నిరసన చేపట్టారు. పెందుర్తి-ఆనందపురం రహదారి విస్తరణలో భాగంగా స్థానిక రాజు చెరువు వద్ద చేపట్టిన పనుల్లో సరిగ్గా సర్దుబాటు జరగడంతో కొంతమంది ఆస్తులు కోల్పోతున్నామని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. తాము రహదారి విస్తరణ అభివృద్ధి పనులకు అడ్డంకి కాదని, అయితే రోడ్డుకు ఇరుపక్కల సమాంతరంగా విస్తరణ చేపట్టి అందరికీ న్యాయం చేయాలని అధికారులను కోరారు.


కూడలిలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే పెదగంట్యాడ జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్టీల్‌ప్లాంటుకు మూడు షిఫ్టుల్లో, జనరల్ షిఫ్ట్‌లోనూ రాకపోకలు సాగించే కార్మికులు, గంగవరం నుంచి పెదగంట్యాడ, గాజువాక రాకపోకలు సాగించే వారితో, నెల్లిముక్కు, నడుపూరు ప్రాంతాల నుంచి పెదగంట్యాడ పారిశ్రామికవాడకు, గాజువాక ప్రాంతానికి రాకపోకలు సాగించే వారితో ఈ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుంది. మూడు ప్రధాన రహదారులకు, ఒక కాలనీ రోడ్డుకు కూడలిగా ఉన్న ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎవరికి వారు ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతుండడంతో ఒక్కోసారి ట్రాఫిక్ జామ్ అవుతుంది. అందువల్ల సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

'ఆర్థిక ప్రయోజనాలను కోల్పోయిన ఉక్కు కార్మికులు'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఎన్నో ఆర్థిక ప్రయోజనాలను కోల్పోయారని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటక్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో ఉద్యోగులకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలయ్యేలా చేశామన్నారు. కార్మికుల ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించవలసిందిగా కోరామన్నారు. ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన అజెండాగా తాము ముందుకు సాగుతున్నామన్నారు. కార్మికుల విషయంలో రాజీ లేని పోరాటాలు చేస్తున్నామని పేర్కొన్నారు. పలు విభాగాలకు చెందిన కార్మికులు యూనియన్‌లో చేరారు. నాయకులు బీఎన్ రాజు, కారు రమణ, ఎస్ఏ నాయుడు, అప్పలరాజు, వెంకన్న, అప్పారావు, సాయి, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమగా... సాగిపో!



రెండు స్వచ్ఛమైన మనసుల కలయిక

సిరిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ.. రెండక్షరాలు కాదు...రెండు స్వచ్ఛమైన మనుసులు. ఆ మధురానుభూతిని పరస్పరం పంచుకునే ఇద్దరు మనుషులు. పగలే వెన్నెల కురిసినట్టు, ప్రపంచమంతా పూలు పరిచినట్టు తియ్యని భావన. మెలకువలో స్వప్నం.. నిద్దురలో కలవరం. మదిలో పదిలంగా దాచుకున్న మాటను అవ్యక్తమైన భాషతో వ్యక్తీకరించే సమయమే ప్రేమికుల దినోత్సవం.

- జీవితంలో అదో మధుర భావన
- నిలువనీయదు.. నిద్దుర రానీయదు..

నేడు ప్రేమికుల దినోత్సవం

ఒకప్పుడు ఇతర దేశాల్లో.. ఆ తరువాత దేశంలోని పట్టణాలు, నగరాలకే పరిమితమైన 'వాలెంటైన్స్ డే' ఇప్పుడు పల్లెలకు విస్తరించింది. కానుకలతో మదిలో మాటలనూ...గ్రీటింగ్‌కార్డుల ద్వారా... తమలోని దాచుకున్న ఊసులను ఒకరితో ఒకరు పంచుకుంటూ మనసులు ఒక్కటవడమే ప్రేమ. ఎన్ని అటంకాలు ఎదురైనా ప్రేమను గెలిపించుకుని కలిసి జీవించాలనే తాపత్రయం ప్రేమికుల్లో జలపాతంలా ప్రవహిస్తూనే ఉంటుంది. తరాలు, స్వరాలు మారినా అమృతంలా గోచరిస్తుంది. నేడు ప్రేమికుల దినోత్సవం.

ఆకర్షణ ప్రేమ కాదు

ప్రేమలో ఆకర్షణ ఉంటుంది. కానీ ఆకర్షణే ప్రేమ కాదు. జీవితానికి సరిపడా సమగ్ర అవగాహనతో ప్రేమికులు నిర్ణయం తీసుకోవాలి. ఇరు కుటుంబాల్లోని పెద్దలను ఒప్పించి, కలిసి జీవించేందుకు సిద్ధపడాలి. అలాకాకుండా తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే వివాహానంతరం అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుంది. ప్రేమలో క్షణికావేశం కూడదు. చదువులోను, చేస్తున్న వృత్తిలోనూ రాణించి, జీవితంలో స్థిరపడే స్థాయికి వచ్చి, కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ.. పరిణితి చెందిన వయసులోనే నిజమైన ప్రేమను స్వీకరించాలి. దానిని వివాహ బంధంగా మలచుకోవాలి.



హత్యలు, ఆత్మహత్యలు వద్దు

ప్రేమించడం తప్పుడు కాదు. ప్రేమించిన వారిని బాధపెట్టడం మోసంతో సమానం. ప్రస్తుతం ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లో క్షణ కాలంలో ప్రేమ చిగురిస్తోంది. దాని పేరిట ఎన్నెన్నో మోసాలు జరుగుతున్నాయి. ప్రేమను దక్కించుకునే క్రమంలో తమ జీవిత లక్ష్యాలను దూరం చేసుకుని, ఉత్తమ ఆశయాలకు గండిపడేలా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రేమ పిచ్చోళ్లు అయిపోతున్నారు. ప్రేమ ప్రాణం పోయాలే కానీ.. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణం తీయకూడదు... తీసుకోకూడదు. మదిలో అలాంటి ఊహలు వస్తే అది నిజమైన ప్రేమ కానేకాదు.

వివాహమే అంతిమ లక్ష్యం

నిజమైన ప్రేమ లక్ష్యం వివాహం. ప్రేయసీ ప్రియులు నిండు నూరేళ్లు కలిసి ఉండాలని ఉవ్విళ్లూరాలి. ప్రతిరోజూ ప్రేమను పంచుకుంటూనే జీవిత మాధుర్యాన్ని గ్రోలాలి. అలాంటి ప్రేమ సామాజికంగా ఆమోదయోగ్యం. లేదంటే అతి ప్రేమ కానేరదు. మాయని మచ్చగా మారి జీవితాలను చిదిమేస్తుంది. సమాజానికి చెడు చేస్తుంది. రెండుహృదయాల కలయికే ప్రేమని గుర్తించగలిగితే ప్రేమికుల జీవితాలు సాఫీగా సాగిపోతాయి. అలాంటి దంపతులు భావి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తారు.

మధుర జ్ఞాపకం



- చాక్లెట్లు, కానుకలతో ప్రేమికులు రడీ
- ప్రేమను తెలిపే కార్డులూ సిద్ధం
- మార్కెట్లో రూ.99 నుంచి రూ.1,100 మధ్య ధరలు

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తమలో గుండెల నిండా నింపుకున్న ప్రేమకు కానుకలను జోడించి అందించడం ఆనవాయితీ. హృదయానికి దగ్గర ఉండే వాటితో పాటు, ఎదుటి వారి అభీష్టానికి తగ్గట్టుగా కానుకలను ఎంచుకుని మరీ అందించడం ప్రేమికుల జీవితంలో మధుర జ్ఞాపకం. అందుకోసం ఒక్కోసారి రోజుల తరబడి అన్వేషించాల్సి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. అవ్యక్తమైన అనుభూతిని ప్రేమగా అందించేలా అద్భుత అవకాశాన్ని అందిస్తున్నాయి.

ఎన్నెన్నో రకాలు

ప్రేమికులు ఒకరికి ఒకరు ఇచ్చి పుచ్చుకునేందుకు వీలుగా మార్కెట్‌లో అనేక రకాల వస్తువులు విరివిగా లభిస్తున్నాయి. అందులో హార్ట్ సింబల్స్‌తో కూడిన వస్తువులకు మంచి డిమాండ్ ఉంది. రెడ్ కలర్‌తో కూడిన స్టిక్, లవ్‌సింబల్స్, ఎన్నెన్నో రకాల చాక్లెట్లు, లైటింగ్.. అండ్..కపుల్స్ చాక్లెట్స్, సింగిల్ పవర్స్.. కీచెయిన్స్, ఫుల్ బోర్డు, విత్ లవ్ గిఫ్ట్ పెద్ద పరిమాణంలోని లవ్ సింబల్, ఐ లవ్‌ప్యూ బాక్సు, రౌండ్ టూ కపుల్స్, లైటింగ్ వంటి వాటికి విపరీతమైన ఆదరణ లభిస్తోంది. ఇలాంటి వాటిని కొనుగోలు చేసి ప్రేమగా అందించేందుకు ప్రేమికులు అమిత ఆసక్తిని కనబరుస్తున్నారు.

పింగాణీ వస్తువులు అదుర్స్..

ప్రేమికులు కానుకలు ఇచ్చుకునేందుకు తాజాగా ప్రత్యేక డిజైనింగ్ కార్డులు, గిఫ్టులు, గాజు, పింగాణీలతో తయారు చేసిన వస్తువులు ఆకట్టుకుంటున్నాయి. నగరంలో గత 15 రోజులుగా చేతితో రూపొందించిన ఇలాంటి వస్తువులను వ్యాపారులు విక్రయిస్తున్నారు. మనసుకు హత్తుకునే కానుకలను ఆకట్టుకునేలా రూపొందించి, విక్రయాలకు సిద్ధం చేశారు.

వన్నె తగ్గని ప్రేమ కార్డులు



ప్రేమను వ్యక్త పరిచేందుకు, మదిలోని భావాలను అక్షరాలుగా ఏర్చి కూర్చి చేతితో అందమైన కాగితంపై రాసిచ్చే రోజులు దాదాపుగా అంతరించిపోయాయి. అయితే తమలోని భావనకు దగ్గరగా ఉండే వివిధ రకాల ప్రేమ కార్డులు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఇలాంటి కార్డులను ఎంపికచేసుకుని, వాటికి మధురమైన చాక్లెట్లను జోడించి.. ప్రేమికుల దినోత్సవానికి స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు.

విక్రయాలు సాధారణం

ఈ ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కార్డులు, ఇతర సామగ్రి విక్రయాలు సాధారణంగా జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. వస్తువును బట్టి వాటి ధరలు రూ.99 నుంచి రూ.1,100 మధ్య ఉన్నాయని తెలిపారు. ప్రేమికులను ఆకట్టుకునేలా వివిధ డిజైన్లలో రూపొందించి విక్రయానికి సిద్ధం చేశామని వివరించారు.



వాలెంటైన్ ప్రేమ కథ

రోమన్ సామ్రాజ్యంలో వాలెంటైన్ అనే వ్యక్తిని జైల్లో నిర్బంధించారు. జైలు ఆవరణలో తిరుగుతున్న జైలర్ కుమార్తెను చూసి అతడు మనసు పారేసుకుంటాడు. తనకు ఉరి శిక్ష అమలు చేసేముందు ఆమెకు లేఖరాసి చివర్లో ... నీ వాలెంటైన్... అని ముగిస్తాడు. అమర ప్రేమికుడు వాలెంటైన్ మరణానికి గుర్తుగా వాలెంటైన్స్ డే జరుపుకుంటున్నారనేది ఓ కథనం.



శాస్త్రీయ భావనా ఉంది

మనలో ప్రేమ భావన కలగడానికి రసాయన శాస్త్రాన్ని అనుసరించి శాస్త్రీయ భావన ఉంది. హృదయం, మెదడు సంయుక్తంగా పనిచేయడంతో మెదడులో ఉత్పన్నమయ్యే డోపామైన్ అనే హార్మోన్ మనిషిలో శృంగార తలంపులకు బాధ్యత తీసుకుంటుందని అమెరికాకు చెందిన మానసిక శాస్త్రవేత్త హెలెన్ ఫిషర్ అన్నారు. డోపోమైన్‌కు తీవ్రమైన ఉత్తేజాన్ని కలిగించే శక్తి కూడా ఉందని తేల్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకారం 9-19 ఏళ్ల మధ్య యువతలోనే ఈ హార్మోన్‌ల ప్రభావం ఎక్కువ. ఈ వయసులో వారిలో కలిగే భావనలు, కోరికలు ఎదుటివారిపై తెలియని ఇష్టాన్ని, ప్రేమను కలిగిస్తుంటాయి. బాహ్య సౌందర్య ఆకర్షణలోపడి వారు క్షణం కనబడకపోయినా ఆందోళనకు గురవుతుంటారు. దానినే ప్రేమగా భావిస్తారని నిపుణులు చెబుతున్నారు. బాల్యంలో ప్రేమకు ఆకర్షణే కారణం. ఇంట్లో పరిస్థితులు ఇందుకు దోహదపడతాయి. ప్రేమించడానికి నిర్దిష్ట వయసంటూ లేకున్నా 23 ఏళ్ల తరువాత ప్రేమలో పడితే దానిని నిజమైన ప్రేమగా చెప్పవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఈ వయసులో ఉన్న వారికి జీవితంపై అవగాహన, కుటుంబ పరిస్థితులపై పరిణతి ఉంటుందని చెబుతున్నారు. ఎదుటి వారిని అర్థం చేసుకునే శక్తి ఉంటుంది కాబట్టి తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం తక్కువగా ఉంటుందంటారు.

ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు సహకరించాలి

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎంఎన్. హరేంధిర ప్రసాద్ కోరారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తరువాత గురువారం సాయంత్రం బరిలో ఉన్న అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. ప్రవర్తనా నియమావళి, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఏజెంట్ల నియామకం, ప్రచారానికి అనుమతులపై సూచనలు ఇచ్చారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తిచేశారు. వాహనాలు, కరపత్రాల ముద్రణ, ప్రచారం తదితర అంశాలకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సింగిల్ విండో డెస్క్ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో నిర్వహించబోయే ర్యాలీలు, ప్రచారాలకు ఆయా జిల్లాల ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండు జిల్లాల సరిహద్దులో ప్రచారం చేయాల్సిన సందర్భంలో తనను సంప్రదించాలన్నారు. నేర చరిత్ర లేని వారిని ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పదవుల్లో ఉన్న వారిని నియమించరాదన్నారు. నమూనా బ్యాలెట్ పత్రాల ముద్రణలో నిబంధనలు పాటించాలని, కరపత్రాల ముద్రణలో ప్రచురణకర్త, ప్రింటర్ పేరు ఉండాలన్నారు. జాతీయ జెండా, కులం, మతం ప్రతిబింబించేలా పత్రాలు రూపొందించవద్దని స్పష్టం చేశారు. ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కు వినియోగించేటప్పుడు ఎన్నికల అధికారులు ఇచ్చిన వైలెట్ కలర్ పెన్ను మాత్రమే ఉపయోగించాలన్నారు. ఓటేసేటప్పుడు తనకు నచ్చిన వ్యక్తికి ఎదురుగా సంబంధిత రోమన్ లేదా ఆంగ్ల నంబరు వేయాలన్నారు. బ్యాలెట్‌పై ఎటువంటి రాతలు రాయకూడదని, టిక్ మార్కు పెట్టకూడదని, అలా చేస్తే ఓటు చెల్లదన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం ముగించాలని కలెక్టర్ సూచించారు.



ఎమ్మెల్సీ బరిలో నిలిచిన అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

- అధికారులకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):బృహత్తర ప్రణాళికా రహదారుల అభివృద్ధి ప్రణాళికలను సాధ్యమైనంత త్వరగా తయారుచేసి, సందేహాలను క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది సహకారంతో నివృత్తి చేసుకుని ఖరారు చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ప్రణాళిక, సాంకేతిక విభాగాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సూచించిన టైమ్‌లైన్స్ ప్రకారం సాగాలని, అలసత్వం వద్దని హెచ్చరించారు. ఎంఎల్‌సీపీ, యూహెచ్‌సీహెచ్ మ్యూజియం, చీమలాపల్లి, ఎండాడ కన్వెన్షన్ సెంటర్ల పనులను సత్వరమే పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సిబ్బందికి నిర్దేశించారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజనీర్ వి.వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప, కార్య నిర్వాహక ఇంజనీర్లు, ప్రణాళికా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

దుకాణాలను తొలగించడం అన్యాయం

- పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు
- జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట పూర్ణామార్కెట్ చిరు వర్తకుల నిరసన

సిరిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తమ దుకాణాలను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ పూర్ణామార్కెట్ చిరు వర్తకుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం జీవీఎంసీ ప్రధాన ద్వారం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ పూర్ణా మార్కెట్‌లో ఎంతో కాలంగా వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వర్తకుల దుకాణాలను తొలగించడం అన్యాయమన్నారు. వీరి వ్యాపారంతో ఎటువంటి సంబంధం లేని లా అండ్ ఆర్డర్ విభాగం పోలీసులు వీరి జంగిడీలు, పూలు, కూరగాయాలు, పండ్లను విసిరి వేయడం అవమానకరం, అమానుషం అని మండిపడ్డారు. నగర మేయర్‌ను కలిసి మొత్తం ఈ విషయాలను తెలియజేశామన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకొని సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యాపారస్తులకు మళ్లీ వ్యాపారం చేసుకునేలా అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జగదాంబ నాయకులు ఎం.సుబ్బారావు, బత్తిన రాము, గోవింద్, ఈశ్వరరావు, అప్పారావు, శ్రీను, చిల్లర వర్తకులు పాల్గొన్నారు.



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద నిరసన తెలుపుతున్న పూర్ణామార్కెట్‌లోని చిరు వర్తకులు

ఆదివాసీ ప్రజలపై మారణకాండ ఆపాలి

- అటవీ సంపద బడాబాబులకు ధారాదత్తం చేయవద్దు
- పలు ప్రజా సంఘాల ఆందోళన

సిరిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలపై మారణకాండ ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను బేషరతుగా నిలిపి వేయాలని వామపక్ష, ఆదివాసీ, హక్కుల, దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జాతి ఆస్తులైన అడవులను కార్పొరేట్ బడాబాబులకు అప్పగించే పనిలో ఎన్డీఏ సర్కారు పడిందని విమర్శించారు. మోదీ సర్కారు విధానాన్ని వ్యతిరేకిద్దామంటూ వామపక్షాలు, ఆదివాసీ, హక్కులు, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో విశాల అటవీ ప్రాంతాలను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే లక్ష్యంతో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తలపెట్టిందని ఆరోపించారు. ఆదివాసీలపై ప్రత్యక్ష సైనిక యుద్ధం చేస్తూ అడవులను నెత్తుటి క్షేత్రంగా మార్చుతోందని మండిపడ్డారు. మానవత్వ వ్యతిరేక ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల మనుగడ, జీవనోపాధికి తెచ్చిన చట్టాలు, సౌకర్యాలు అన్నింటినీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించవద్దని ఏపీలోని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం.పైడిరాజు, వై.కొండయ్య, జగ్గునాయుడు, వెం.వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీమన్నారాయణ, పీఎస్ కృష్ణ, ఎం.లక్ష్మి, కె.లలిత, కె.పద్మ, మల్లేష్, పార్వతి, చిన్నారావు, రమణ, లక్ష్మి, వెంకటరావు, నూకరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో వామపక్ష, ఆదివాసీ, దళిత, ప్రజా సంఘాల నేతలు

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై షీలానగర్ జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చట్టివానిపాలేనికి చెందిన రొంగల ప్రణీత్ (24) డిప్లొమా పూర్తి చేశాడు. ప్రణీత్ తండ్రి రవికుమార్ ప్రైవేటుగా విద్యుత్ పనులు చేస్తుండగా, తల్లి లక్ష్మి అక్షయపాత్రలో సహాయకురాలు. వీరికి ప్రణీత్ ఒక్కడే కుమారుడు. ఇటీవల ఓ షాపింగ్‌మాల్‌లో ఉద్యోగానికి ఎంపికవడంతో శిక్షణ నిమిత్తం కంచరపాలెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై కంచరపాలెం వెళ్తుండగా షీలానగర్ జంక్షన్ దాటాక అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రణీత్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఒక్కగా నొక్క కొడుకు కానరానిలోకానికి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రణీత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ తరలించి గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రణీత్ (ఫైల్ ఫొటో)

నౌసేనాబాగ్‌లో మహిళా సర్వెంట్ మృతి

మల్కాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి నౌసేనాబాగ్‌లో ఓ మహిళా సర్వెంట్ తన గదిలో శవమై పడి ఉండడాన్ని మల్కాపురం పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేవీ అధికారి శివరాత్ ఇంట్లో మహారాష్ట్రకు చెందిన అంబదాస్ కమల (66) పనిమనిషిగా ఉంటున్నారు. కాగా శివరాత్ తన సొంత పనిపై కుమార్తెతో కలిసి ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. అయితే మూడు రోజులుగా కమల తన గది నుంచి బయటకు రాలేదు. దీంతో నౌసేనాబాగ్ సెక్యూరిటీ గార్డులకు అనుమానం వచ్చి నేవల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఆ ఇంటిని పరిశీలించి, మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ఇంటి తలుపులు తెరిచి చూడగా కమల టవల్ కట్టుకుని కిందపడి మృతి చెంది కనిపించింది. పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో ఎస్ఐ శ్యామలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బియ్యం కొనుగోలు వ్యవహారంలో డీలర్ల ఘర్షణ

జగదంబ కూడలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కురుపాం మార్కెట్, పూర్ణామార్కెట్ పరిధిలో నలుగురు రేషన్ డీలర్లు ఘర్షణకు దిగారు. కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు వ్యవహారంలో తేడాలు రావడంతో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఘర్షణకు దిగిన వారిలో ఇద్దరు బినామీలు, మరో ఇద్దరు సొసైటీ డిపోలను అక్రమంగా తీసుకుని నిర్వహిస్తున్నారు. ప్రతినెలా ఒకటోతేదీ నుంచి బియ్యం పంపిణీ జరుగుతుంది. ఈ ప్రాంతంలో ఎక్కువమంది ఎండీయూ వాహనదారులు తమ వాహనాలను రేషన్ డిపోల వద్దే ఉంచుతున్నారు. కార్డుదారులకు బియ్యం డబ్బులు ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో చాలాకాలంగా డీలర్ల మధ్య వివాదాలున్నాయి. ఈ క్రమంలో ఒక డిపోను కురుపాం మార్కెట్ నుంచి తరలించాలని ముగ్గురు డీలర్లు ఒత్తిడి తీసుకుస్తున్నారు. దీనికి అతడు అంగీకరించకపోవడంతో బుధవారం సాయంత్రం ఘర్షణకు దిగారు. ఈ గొడవలో కుటుంబసభ్యులు జోక్యంచేసుకోవడంతో ఒకరిద్దరికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స అనంతరం గురువారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ లోగా రేషన్ డీలర్ల ప్రతినిధులు జోక్యం చేసుకుని రాజీకి ఒప్పించారు.

టెన్త్ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు

- ఉత్తీర్ణత మార్కుల శాతం తగ్గింపు
- పరీక్ష హాలులో ప్రత్యేక సదుపాయాలు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు రాయనున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం వివిధ రాయితీలు ప్రకటించిందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త కె.శకుంతల, మహిళా ఉపాధ్యాయ నాయకులు వి.రాణి తెలిపారు. ఎనిమిది విభాగాలలో ఉత్తీర్ణతా శాతాన్ని గణనీయంగా తగ్గించారని అన్నారు. మూల్యాంకన జరిగే సమయంలో వ్యాకరణ దోషాలు, వాక్య నిర్మాణంలో పొరపాట్లకు సడలింపు, క్యాలికులేటర్ల వినియోగానికి అవకాశం ఉంటుందన్నారు. అంధత్వం ఉన్న వారికి ఉత్తీర్ణతా మార్కులను నూటికి 35 నుంచి 20కి తగ్గించారని, వినికిడి లోపం ఉన్నవారు తెలుగు, ఆంగ్లం, హిందీల్లో ఒక సబ్జెక్టు నుంచి మినహాయింపు పొందవచ్చన్నారు.కాగా బుద్ధిమాంద్యం, ఎదుగుదల లోపం, మస్తిష్క పక్షపాతం ఉన్న వారు కేవలం పది మార్కులు సంపాదిస్తే సరిపోతుందన్నారు. వినికిడి లోపం వారు మినహా మిగిలిన దివ్యాంగులకు సహాయకుడు (స్క్రైబ్) నియమించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎముకల బలహీనత ఉన్న వారికి ప్రత్యేక బల్ల, కుర్చీలను కూడా అందిస్తామన్నారు. అయితే ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముందుగా ఈ కేటగిరి విద్యార్థుల వివరాలను వారి వైద్య ధ్రువీకరణలతో అందించి ప్రత్యేకంగా విద్యా శాఖ ఉన్నతాధికారులకు తెలియజేసి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.